

గణనాథులకు ఘన వీడ్కోలు





కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

గురువారం 24, సెప్టెంబర్ 2026 16 పేజీలు

కరీంనగర్ జిల్లాలో అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జనం

పకడ్బందీ ఏర్పాట్లతో ప్రశాంతంగా ముగిసిన ఉత్సవాలు

నగరం నుంచి పల్లె వరకు భక్తజన సందడి.. భారీ బందోబస్తు

కరీంనగర్, ప్రభాతవార్త: తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులకు కరీంనగర్ జిల్లా ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయి. కరీంనగర్ నగరంతో పాటు హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండి తదితర పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో గణేష్ విగ్రహాలను శోభాయాత్రలుగా తరలించి నిమజ్జనం చేశారు. భక్తుల జైజై నినాదాలు, డప్పు చప్పుళ్లు, భక్తిగీతాలతో నిమజ్జన కేంద్రాలు సందడిగా మారాయి.



సీఎం పర్యటనకు పకడ్బందీ బందోబస్తు

క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

మహేశ్ బి.గితే.. హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాల పరిశీలన

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 30న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు ముమ్మరం చేసింది. పర్యటనను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ మహేశ్ బి.గితే బుధవారం పోలీసు ఉన్నతాధికారులతో కలిసి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



2లో

నిమజ్జనం పకడ్బందీగా..

పుష్కరాలకు పక్కా ప్రణాళిక

ఇందిరమ్మ ఇళ్లు పట్టాల పరిశీలన వేగవంతం చేయాలి

గోదావరి పుష్కరాలు-2027కు ఇప్పటి నుంచే కార్యాచరణ

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సమీక్ష

జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త:

వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అదే సమయంలో బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకానికి సంబంధించిన పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్ల పరిశీలనను వేగవంతం చేయడంతో పాటు గోదావరి పుష్కరాలు-2027కు ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓలు, హౌసింగ్ ఏఈలు తదితర అధికారులతో ఆయా అంశాలపై సమీక్షించారు.



2లో



గణనాథులకు ఘన వీడ్కోలు

కరీంనగర్ జిల్లాలో అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జనం

పకడ్బందీ ఏర్పాట్లతో ప్రశాంతంగా ముగిసిన ఉత్సవాలు

నగరం నుంచి పల్లె వరకు భక్తజన సందడి.. భారీ బందోబస్తు

కరీంనగర్, ప్రభాతవార్త: తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులకు కరీంనగర్ జిల్లా ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయి. కరీంనగర్ నగరంతో పాటు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి తదితర పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో గణేష్ విగ్రహాలను శోభాయాత్రలుగా తరలించి నిమజ్జనం చేశారు. భక్తుల జైజై నినాదాలు, డప్పు చప్పుళ్లు, భక్తిగీతాలతో నిమజ్జన కేంద్రాలు సందడిగా మారాయి.

తొమ్మిది రోజుల భక్తి.. చివరి రోజు సందడి

వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల్లో తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు ఉదయం నుంచే విగ్రహాలను నిమజ్జనానికి తరలించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేసుకున్నాయి. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై గణనాథులను ఉంచి శోభాయాత్రలు నిర్వహించారు. యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలకు మరింత శోభ తీసుకొచ్చారు.

కరీంనగర్ పట్టణంలో నాలుగు వేల విగ్రహాలు

కరీంనగర్ పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన నాలుగు వేల వినాయక విగ్రహాలను బుధవారం నిమజ్జన కార్యక్రమానికి తరలించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథులకు ఘనంగా వీడ్కోలు పలికారు.

మానకొండూరులో భారీ ఏర్పాట్లు

కరీంనగర్ నగర పరిధి నుంచి అత్యధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు మానకొండూరు చెరువు వైపు తరలివెళ్లాయి. గతంతో పోలిస్తే ఈసారి నిమజ్జన ఏర్పాట్లను భారీ స్థాయిలో చేపట్టారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అవసరమైన సంఖ్యలో క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జన ప్రాంతంలో లైటింగ్, సౌండ్ సిస్టం, ఎల్ఈడీ స్క్రీన్లను అందుబాటులో ఉంచారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేశారు. విగ్రహాల రాకపోకలు, నిమజ్జన ప్రక్రియను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా ఎప్పటికప్పుడు పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

గజ ఈతగాళ్లు.. వైద్య బృందాలు సిద్ధం

మానకొండూరు, కొత్తపల్లి, చింతకుంట నిమజ్జన కేంద్రాల వద్ద గజ



ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే స్పందించేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బందిని నిమజ్జన కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేశారు.

కొత్తపల్లి, చింతకుంటలో ప్రత్యేక ఏర్పాట్లు

కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కొత్తపల్లి, చింతకుంట ప్రాంతాల్లో నిమజ్జన కేంద్రాలను సిద్ధం చేశారు. భక్తులు, ఉత్సవ కమిటీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. తాగునీరు, విద్యుత్, లైటింగ్, పారిశుద్ధం తదితర ఏర్పాట్లు చేశారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పర్యవేక్షించారు.

హుజూరాబాద్ డివిజన్‌లోనూ ఘనంగా

హుజూరాబాద్ డివిజన్ పరిధిలోనూ వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. హుజూరాబాద్, జమ్మికుంటతో పాటు ఆయా మండలాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను భక్తులు శోభాయాత్రలుగా తరలించి నిమజ్జనం చేశారు. చొప్పదండి ప్రాంతంలోనూ ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయి.

భారీ బందోబస్తు.. నిరంతర పర్యవేక్షణ

నిమజ్జనోత్సవాల సందర్భంగా కరీంనగర్ నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లు, శోభాయాత్రలు జరిగే మార్గాలు, నిమజ్జన కేంద్రాల వద్ద పోలీసు సిబ్బందిని మోహరించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అధికారులు, పోలీసులు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించారు.

ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ

జిల్లా ఉన్నతాధికారులు నిమజ్జన కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కిందిస్థాయి సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. నిమజ్జన కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తూ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సమన్వయంతో సాఫీగా..

జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు, వైద్య, పారిశుద్ధ్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సంయుక్తంగా నిమజ్జన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు భద్రతకు ప్రాధాన్యం ఇచ్చారు. అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాలు సజావుగా సాగాయి. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో గణనాథులకు వీడ్కోలు పలికారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ బందోబస్తు

క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ మహేశ్ బి.గితే

హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాల పరిశీలన

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 30న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు ముమ్మరం చేసింది. పర్యటనను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ మహేశ్ బి.గితే బుధవారం పోలీసు ఉన్నతాధికారులతో కలిసి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం రాక కోసం సిద్ధం చేస్తున్న హెలిప్యాడ్‌తో పాటు సభా ప్రాంగణం, వీఐపీల రాకపోకలు, వాహనాల పార్కింగ్ స్థలాలను ఎస్పీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భద్రత విషయంలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా పటిష్ఠ కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీస్, రెవెన్యూ, ఇంజినీరింగ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎస్పీ మాట్లాడుతూ.. వీవీఐపీ, వీఐపీ బందోబస్తులో ఎక్కడా సమన్వయ లోపం ఉండకూడదన్నారు. సభాస్థలికి ప్రజలు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా రూట్ డైవర్షన్లు, పకడ్బందీ పార్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర సేవల రాకపోకలకు ప్రత్యేక మార్గాలు కేటాయించాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ పరిశీలనలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ డీఈ శాంతయ్య, ఎస్సైలు గణేశ్, నాగరాజు, రాజు తదితర సిబ్బంది పాల్గొన్నారు.





నిమజ్జనం పకడ్బందీగా..

పుష్కరాలకు పక్కా ప్రణాళిక

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పరిశీలన వేగవంతం చేయాలి

గోదావరి పుష్కరాలు-2027కు ఇప్పటి నుంచే కార్యాచరణ

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సమీక్ష

జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త: వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అదే సమయంలో బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకానికి సంబంధించిన పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్ల పరిశీలనను వేగవంతం చేయడంతో పాటు గోదావరి పుష్కరాలు-2027కు ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓలు, హౌసింగ్ ఏఈలు తదితర అధికారులతో ఆయా అంశాలపై సమీక్షించారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలోని వినాయక నిమజ్జన ప్రాంతాలు, శోభాయాత్ర సాగే మార్గాలను అధికారులు ముందుగానే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో బారికేడ్లు, విద్యుత్ దీపాలు, తాగు నీరు, పారిశుధ్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు క్రేన్లు, గజ ఈతగాళ్లు, వైద్య బృందాలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఊరేగింపు మార్గాల్లో విద్యుత్ తీగలు, గుంతలు, ఇరుకైన ప్రాంతాలు తదితర ప్రమాదకర ప్రదేశాలను ముందుగానే గుర్తించి చర్యలు చేపట్టాలని తెలిపారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

29,134 పట్టాల పరిశీలన

బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకం కింద జిల్లాలో అందుబాటులో ఉన్న 29,134 పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను సంబంధిత రికార్డులతో క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే లబ్ధిదారులకు పంపిణీ చేసినవి, ప్రస్తుతం అందుబాటులో ఉన్నవి, ఇంకా పంపిణీ చేయాల్సిన వాటి వివరాలను మండలాలు, మున్సిపాలిటీల వారీగా స్పష్టంగా నిర్ధారించాలన్నారు.రికార్డుల పరిశీలనలో ఎలాంటి వ్యత్యాసాలు తలెత్తకుండా తహసీల్దార్లు వ్యక్తిగతంగా తనిఖీ చేసి ధ్రువీకరించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వివరాల నమోదులో తప్పిదాలకు అవకాశం లేకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.

పుష్కరాలకు ముందస్తు ప్రణాళిక

గోదావరి పుష్కరాలు-2027ను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే సన్నద్ధత ప్రారంభించాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ సూచించారు. పుష్కర ఘాట్లు, భక్తులు చేరుకునే మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, తాగునీటి వసతి, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల వసతి తదితర అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు.ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన పనులను ప్రాధాన్య క్రమంలో గుర్తించి అంచనాలు రూపొందించాలని తెలిపారు. అవసరమైన నిధులు, మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సమన్వయంతో ముందుకు

నిమజ్జనం, గృహ నిర్మాణ పథకం, పుష్కరాల ఏర్పాట్లలో శాఖల మధ్య సమన్వయం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆదేశించారు.

నిందితులకు కఠిన శిక్ష పడేలా పటిష్టమైన ఆధారాలతో ముందుకు తీసుకెళ్లాలి

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలో సంచలనం సృష్టించిన యువతి హత్య కేసు దర్యాప్తు పురోగతి పరిశీలన..

మృతురాలు అక్షిత రాణి నివాస సందర్శన



పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త: నిందితులకు న్యాయస్థానంలో కఠిన శిక్ష పడేలా కేసును పటిష్టమైన ఆధారాలతో ముందుకు తీసుకెళ్లాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన యువతి హత్య కేసును గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు ఛేదించి, నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు అత్యంత ప్రాధాన్యత కలిగిన సున్నితమైన కేసు కావడంతో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డితో కలిసి మృతురాలు అక్షిత రాణి నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేసు దర్యాప్తు పురోగతి, నేరానికి సంబంధించిన వివరాలు, నేరం జరిగిన తీరు తదితర అంశాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్న సీపీ, దర్యాప్తు అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, కేసులో తుది న్యాయస్థాన తీర్పు వచ్చే వరకు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ ప్రక్రియను సమర్థవంతంగా కొనసాగించాలని సీపీ ఆదేశించారు. దర్యాప్తులో ఎలాంటి లోపాలు, అలసత్వం, నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. కేసులోని ప్రతి సాంకేతిక, న్యాయపరమైన అంశాన్ని పరిగణనలోకి తీసుకుని శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తును పూర్తి చేయాలని, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నివేదికలు, ఇతర శాస్త్రీయ ఆధారాలను సక్రమంగా సేకరించి, కేసు దర్యాప్తులో సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. నిందితులకు న్యాయస్థానంలో కఠిన శిక్ష పడేలా కేసును పటిష్టమైన ఆధారాలతో ముందుకు తీసుకెళ్లాలని, దర్యాప్తు, ప్రాసిక్యూషన్‌లో సమన్వయంతో పనిచేయాలని ఏసీపీ, ఇన్స్పెక్టర్లను సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు.



రోడ్డు ప్రమాదంలో
బిజెపి నాయకురాలి దుర్మరణం

భర్తకు తీవ్రగాయాలు... వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలింపు

జమ్మికుంట/ హుజురాబాద్, ప్రభాత వార్త: కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి గ్రామ శివారులోని జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బిజెపి నాయకురాలు కొంకటి సులోచన (45) అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళితే... దంపతులు కొంకటి సులోచన, కొంకటి రమేష్ లు తమ ద్విచక్రవాహనంపై పెద్దపాపయ్యపల్లి నుండి స్వగ్రామమైన చెల్పూర్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యంలో వెనుక నుండి అతివేగంగా వచ్చిన డిసిఎం వ్యాన్ వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సులోచన తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ఆమె భర్త రమేష్ కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు, క్షతగాత్రుడిని హుటాహుటిన వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన సులోచన గత ఎనిమిది నెలల క్రితం చెల్పూర్ గ్రామంలో జరిగిన ఎన్నికల్లో బిజెపి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓడిపోయారు. ఆమె భర్త సురేష్ ప్రస్తుతం బిజెపి మండల నాయకుడిగా కొనసాగుతున్నారు. పండుగ పూట కుటుంబంలో ఊహించని ఈ విషాదం జరగడంతో చెల్పూర్ గ్రామంలో కన్నీటి ఛాయలు అలుముకున్నాయి. సులోచన మృతి పట్ల చెల్పూర్ గ్రామ సర్పంచ్ వంతడుపుల కస్తూరి, మాజీ సర్పంచులు ఉదయమరి కృష్ణమూర్తి శర్మ, చిన్నక్క విజయలక్ష్మి, పోలంపల్లి శ్రీనివాస్ రెడ్డి, నేరెళ్ల మహేందర్ గౌడ్, బిజెపి నేత మండల సాయిబాబా, బిఆర్ఎస్ నాయకుడు పంజాల సదానందం గౌడ్ తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న హుజురాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కేయులో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ పోస్టర్ ఆవిష్కరణ

ఎడ్యుకేషన్ కేయు సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :కాకతీయ విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈ నెల 26న హ్యూమానిటీస్ బిల్డింగ్‌లోని సెమినార్ హాల్‌లో నిర్వహించనున్న మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ పోస్టర్‌ను బుధవారం ప్రభుత్వ పాలన మరియు మానవ వనరుల విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కర్నాటి ప్రతాపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులు ఈ మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకుని తమ విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. వెంకటయ్య డా. లింగయ్య, డా. శ్రీను, డా. ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ గణనాథుడికి ప్రత్యేక పూజలు

శోభాయమానంగా నిమజ్జన ఊరేగింపు

కరీంనగర్, ప్రభాతవార్త : కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహానికి ముగింపు రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళ హారతుల నడుమ స్వామివారికి పూజా కార్యక్రమాలు పూర్తి చేసి భక్తిశ్రద్ధలతో విగ్రహాన్ని కదిలించారు. అనంతరం గణపతి బప్పా మోరియా నామస్మరణలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం మధ్య నిమజ్జన శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ (బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి), మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు. వీరంతా కలసి స్వామివారికి పట్టు వస్త్రాలు, పూలమాలలు సమర్పించి ప్రత్యేక అర్చనలు జరిపారు. అనంతరం విగ్రహాన్ని కదిలించి ఊరేగింపును ప్రారంభించారు. ఈ వేడుకలో మున్సిపల్ అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ద్విచక్ర వాహనం దొంగతనం కేసులో నిందుతుని రెండు సంవత్సరాల జైలు శిక్ష...



తంగళ్ళపల్లి,ప్రభాతవార్త. ద్విచక్ర వాహనం దొంగతనం చేసిన కేసులో నిందుతుని రెండు సం. జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల రెండవ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి గడ్డం మేఘన బుధవారం తీర్పు వెల్లడించినట్లు తంగళ్ళపల్లి ఎస్.ఐ అశోక్ తెలిపారు. వివరాల మేరకు తంగళ్ళపల్లి మండలంలోని బద్దెనపల్లి గ్రామం శివారులో గల నయారా పెట్రోల్ దగ్గర లో గల పౌల్ట్రీ ఫార్మ్ యజమాని జిందం రాజకుమార్ తేదీ.30 జూన్ 2025 రోజున తన పౌల్ట్రీ ఫార్మ్ ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీ జరిగిందని తంగళ్ళపల్లి పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనంను దొంగతనం చేసిన ఇల్లంతకుంట గ్రామానికి చెందిన దుర్మిట్ల నరేష్ ని అరెస్టు చేసి రిమాండ్ కి తరలించారు. విచారణ అనంతరం అప్పటి ఎస్.ఐ ఉపేంద్ర చారి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసారు. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ కేసు వాదించగా, కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ. శ్రవణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ ఆడేపు దేవేందర్ సాక్షులను ప్రవేశ పెట్టారు.కేసు పూర్వపరాలు పరిశీలించిన మేజిస్ట్రేట్ నిందితుడు దుర్మిట్ల నరేష్ కి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు ఎస్.ఐ అశోక్ తెలిపారు.

నేరాలు-దారుణాలు

పిడుగుపాటుకు మహిళా మృతి



జూలపల్లి,ప్రభాతవార్త: జూలపల్లి మండలం బాలరాజ్ పల్లిలో విషాదం చోటుచేసుకుంది. పిడుగుపాటుకు ధర్మారం మండలం చామనపల్లి గ్రామానికి చెందిన మారం అంజమ్మ అనే కూలీ పిడుగు పాటుతో మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది.అలాగే కొత్తూరు గ్రామానికి చెందిన లక్ష్మీ అనే కూలి తీవ్రంగా గాయపడగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. అయితే ఈ మహిళలు జూలపల్లి మండలం బాలరాజ్ పల్లె కు కూలి పనిమీద వచ్చి పిడుగుపాటుకు గురికావడం ఆశ్చర్యానికి గురి చేసింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై బి.మల్లేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్

వివరాలు వెల్లడించిన సిఐ రవీందర్

చందుర్తి,సెప్టెంబర్ 23: ప్రభాతవార్త వినాయక నిమజ్జనం సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో బెదిరింపు వాయిస్ మెసేజ్ పంపిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు చందుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ కట్ల రవీందర్ తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మోతే నితిన్ వినాయక నిమజ్జనం సందర్భంగా తనతో గొడవ పెట్టుకున్న వారిని చంపుతానని వాట్సాప్ గ్రూప్ లో వాయిస్ మెసేజ్ తో బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద అనుమాదాస్పదంగా కనిపించిన నితిన్ ను అదుపులోకి తీసుకొని సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్ కు తరలించారు. సందర్భంగా సీఐ మాట్లాడుతూ సోషల్ మీడియా,వాట్సాప్ గ్రూపుల్లో చట్ట వ్యతిరేక సందేహాలను ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మోతిరాం,సిబ్బంది ఉన్నారు.

అప్పుల బాధతో గీత కార్మికుడి ఆత్మహత్య..



ప్రభాత వార్త కోనరావుపేట కోనరావుపేట మండల కేంద్రం లో ఓ గీత కార్మికుడు ఆత్మ హత్య చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కోనం ావుపేట గ్రామానికి చెందిన లింగాపురం వెంకటి (గౌడ్) కల్లుగీత కార్మికుడిగా పనిచేస్తూ భార్యను పోషిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. అప్పుల సమస్య, పిల్లలు లేకపోవడం, సొంత ఇల్లు లేకపోవడంతో తమ్ముడి ఇంట్లో నివసిస్తుండటం వంటి కారణాలతో కొంతకాలంగా మనోవేదనకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ క్రమంలో బుధవారం ఉదయం డంపింగ్ యార్డు సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్తున్న గొర్రెల కాపరులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్ఐ రామ్మోహన్ పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినాయక నిమజ్జనం ఏర్పాట్లు పగడ్బందీగా చేపట్టాలి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల, ప్రభాతవార్త : భక్తి శ్రద్ధలతో కోరుట్ల పట్టణంలో వినాయక నిమజ్జన వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు కృష్ణారావు కోరారు. కోరుట్ల పట్టణ వాగు వద్ద వినాయక నిమజ్జనం వేడుకల కోసం మున్సిపల్ పోలీస్ రెవెన్యూ ఇతర శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను బుధవారం స్థానిక మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్, తహసిల్దార్ కృష్ణ చైతన్య, మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర, సబ్ ఇన్స్పెక్టర్ శ్యామ్ రాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ లు పరిశీలించారు. అనంతరం కృష్ణారావు మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వా హకులు తమ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వ హిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రతి ఒక్క నిర్వాహకులు అధి కారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎటువంటి సంఘటనలు జరగకుండా శోభాయాత్ర నిమజ్జనం వేడుకలను నిర్వహించుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళికతో నిమజ్జన వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు వినాయక నిమజ్జనానికి కావలసిన స్టేజ్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వైద్య సేవలు



అగ్నిమాపక శాఖ మత్స్యశాఖ అధికారుల సేవలు అందించాలని, నిమజ్జన ప్రదేశాల్లో పారిశుద్ధ్య పనులు చేయించారని భారీ క్రేన్లు చిన్న క్రేన్ల గజహిత గాళ్లను అవసరం మేరకు అందుబాటులో ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులను కోరారు. పట్టణ వాసులతోపాటు భక్తులు పిల్లలు తరలివచ్చే అవకాశం నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, యూత్ కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుప్పాల ప్రభాకర్, ఎతిరాజం నర్సయ్య, తెడ్డు విజయ్, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

ప్రెస్ క్లబ్ కోరుట్ల ఆధ్వర్యంలో అన్నప్రాసద వితరణ

కోరుట్ల, ప్రభాతవార్త :



పట్టణంలోని ప్రెస్ క్లబ్ కోరుట్ల ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ప్రెస్ క్లబ్ కోరుట్ల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణను బుధవారం చేపట్టారు. ఈ వేడుకలకు



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ అనూప్ రావు, కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై శ్యామ్ రాజ్ లు హాజరైన వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, టీయుడబ్ల్యూజే హెచ్ 143రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుల రాంగోపాల్, జిల్లా అధ్యక్షుడు శికారి రామకృష్ణ, టెంజ్యు జిల్లా అధ్యక్షుడు అంజు గౌడ్, క్లబ్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, సభ్యులు ప్రకాష్, శంకర్, లక్ష్మణ్, నవీన్, శ్రీనివాస్, రమణ, రాజు, సతీష్, సాజీద్, హైమద్, ఆలీ, విజయ్, రఘు పాల్గొన్నారు.

పోషక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్ల పట్టణంలోని 1వ వార్డు భీముని దుబ్బా 3 అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి, వార్డు కౌన్సిలర్ జాల మాధవి వినోద్ ఆధ్వర్యంలో పోషక మాసం సంబరాలు నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ మాధవి తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తూ, ప్రతి కుటుంబంలోని తల్లులు తప్పనిసరిగా పరిశుభ్రతతో కూడిన పోషకాలు తీసుకోవడం ద్వారా కుటుంబాన్నంత ఆరోగ్యవంతులుగా ఉంచవచ్చన్నారు. పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పెరుగు, మిల్లెట్స్, వంటి పోషకాలు ఉన్న ఆహారాన్ని ఉపయోగించాలని, గర్భిణీలు బాలింతలు పిల్లలు రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు కాల్షియం, ఐరన్ ఎక్కువగా చేసుకోవాలన్నారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పోతుగంటి పద్మ, రేంజర్ల రాజమణి, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మన్నెగూడెంలో ఘనంగా గణపతి నిమజ్జనోత్సవం

భీమారం, ప్రభాతవార్త :



భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఎలాంటి డీజేలు, శబ్ద కాలుష్యానికి తావులేకుండా తబలా, మంగళ వాయిద్యాలతో భజన కీర్తనలు ఆలపిస్తూ గణపతి విగ్రహాన్ని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. భక్తులు భజనలతో ఉత్సాహంగా పాల్గొని అనంతరం గణనాథుడిని నిమజ్జనం చేశారు. సంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన ఈ వేడుకలు గ్రామంలో భక్తి వాతావరణాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో పద్మశాలి కుల సంఘం అధ్యక్షులు ఆడెపు రాము, ఉపాధ్యక్షులు హనుమాన్ల నారాయణ, కోశాధికారి కైరవకొండ మధు, సెక్రెటరీ వడ్లకొండ రాము, జాయింట్ సెక్రెటరీ వడ్డపర్ల వినయ్‌తో పాటు సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోరుట్ల వార్త



జూనియర్ కళాశాలను సందర్శించిన డిఐఈఓ

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర)ను ఇటీవల పదవీ బాధ్యతలు పొందిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై. రమేష్ బాబు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి కళాశాల ఆవరణలో మొక్కను నాటారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగ్స్, షూ, సాక్స్ లను పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే సదుపాయాలను వినియోగించుకొని మంచి స్థానంలో నిలబడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గౌసర్ రెహమాన్, ఎన్ఎస్ఎస్ పిఓ గంగాప్రసాద్, అధ్యాపకులు ఇమ్రాన్ ఖాన్, హబీబ్,శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం,వంశీ, రాజు, శిరీష్,జయదేవ, సంజీవ్,అహ్మద్,ఫాతిమా ,స్వరూప, సంధ్య, షేక్ ఫాతిమా, బూతుల్ ,ఇత్తేశం రెహమత్, వసుధ, రాజశేఖర్,నవీన, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పల్లకిలో మట్టి వినాయకుడు

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :



కోరుట్ల మండలంలోని యూసఫ్ నగర్ గ్రామంలో యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుణ్ణి పల్లకిలో శోభ యాత్ర నిర్వహించారు. భక్తి పాటలతో గణపతి బొప్ప మోరియా అంటూ సాంస్కృతిక కార్యక్రమం ద్వారా వెళ్లి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుకారం గౌడ్, యంగ్ స్టార్ యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల్లో డా.బోగ శ్రావణి ప్రత్యేక పూజలు

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్, పొలాస, తక్కల్లపెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పలు గణేష్ మండపాలను బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డా.బోగ శ్రావణి సందర్శించారు.ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా. బోగ శ్రావణి మాట్లాడుతూ, గణనాథుడి ఆశీస్సులతో జగిత్యాల నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న మండపాల నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ మండల ముఖ్య నాయకులు, గ్రామస్తులు, యువత,మహిళలు,గణేష్ ఉత్సవాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



బై.. బై.. గణేశా..

కన్నుల పండువగా గణనాథుడి శోభాయాత్ర

సుల్తానాబాద్, ప్రభాతవార్త: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సుల్తానాబాద్ మండల వ్యాప్తంగా గణనాథుడి నిమజ్జన వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణపయ్యకు భక్తులు కన్నీటి వీడ్కోలు పలికారు.ఁగణపతి బొప్పా మోరియా.. జై గణేశ్.. మోరియారే అంటూ నినాదాలతో పట్టణం, పల్లెలు మార్మోగాయి.వివిధ గణేష్ మండపాల వద్ద ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించిన వాహనాలపై గణనాథుడిని ప్రతిష్ఠించి శోభాయాత్రలు నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాలు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో శోభాయాత్రలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. దారిపొడవునా మంగళహారతులుగణనాథుడి శోభాయాత్రకు దారిపొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. పెద్దచెరువు వద్ద ప్రత్యేక పూజలుసుల్తానాబాద్ పెద్దచెరువు వద్ద మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, కమిషనర్ రమేష్, సీఐ రంజిత్‌రావు, ఎస్సై చంద్రకుమార్ గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళహారతులతో నిమజ్జన వేడుకలను ప్రారంభించారు. సీఐ రంజిత్‌రావు, ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ భద్రతా చర్యలు చేపట్టారు.పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని నిమజ్జన ప్రదేశాల వద్ద మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు.పోలీసు, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడంతో నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రత్యేక పూజలు.. భక్తుల సందడి..

గోదావరిఖని,ప్రభాత వార్త: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గోదావరిఖని చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్ బుధవారం దర్శించుకున్నారు. మండపానికి చేరుకున్న ఆయన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.ప్రత్యేక పూజలువిశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపానికి ఎమ్మెల్యే చేరుకోగా నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం గణనాథుడికి పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. రామగుండం నియోజకవర్గ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, ప్రజల మధ్య ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. పండుగలను భక్తిశ్రద్ధలతో పాటు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. వినాయక చవితి నేపథ్యంలో గోదావరిఖని నగరంలోని వివిధ ప్రాంతాల్లో మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది. కుటుంబ సభ్యులతో కలిసి భక్తులు గణనాథుడిని దర్శించుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహిస్తున్నారు. యువత, మహిళలు, చిన్నారులు ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. పలుచోట్ల ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మండపాల వద్ద భక్తుల రాకపోకలు పెరుగుతున్న నేపథ్యంలో నిర్వాహకులు క్రమశిక్షణతో కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. గణనాథుడి ఆశీస్సులతో రామగుండం నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి కొనసాగుతుందని తెలిపారు. పండుగలు ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చే సందర్భాలని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారంతో ఉత్సవాలను నిర్వహించాలని కోరారు.ఁవిశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉత్సవాల ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. భక్తుల కోసం కల్పిస్తున్న సౌకర్యాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాలు విజయవంతంగా కొనసాగేందుకు నిర్వాహకులు, స్థానికులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, గుమ్మడి కుమారస్వామి, కార్పొరేషన్ అధ్యక్షుడు ఎండీ ముస్తఫా, విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గణనాథుడిని దర్శించుకున్న సమయంలో మండపం వద్ద భక్తుల సందడి కనిపించింది. పూజల అనంతరం నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.



కన్నుల పండువగా గణనాథుడి శోభాయాత్ర

మంగళహారతులతో ఘన స్వాగతం..

జూలపల్లి,ప్రభాతవార్త: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జూ లపల్లి మండలం తేలుకుంట గ్రామంలో గణనాథుడి నిమజ్జన వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణపయ్యకు భక్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. గణపతి బొప్పా మోరియా.. జై గణేశ్.. మోరియారే అంటూ నినాదాలతో తేలుకుంట గ్రామంలో మార్మోగాయి.బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించిన వాహనంపై గణనాథుడిని ప్రతిష్ఠించి శోభాయాత్ర నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాలు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల గణేష్ యూత్ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఘనంగా విజన్ హై స్కూల్ వినాయక నిమజ్జనం

కొత్తపల్లి, సెప్టెంబర్23(ప్రభాతవార్త) కరీంనగర్ నగరం రేకుర్తి లోని విజన్ హై స్కూల్ లో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా విద్యార్థులందరూ వినాయకునికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి బుధవారం నాడు విద్యార్థులందరూ ఆటపాటలతో డాన్సులతో ఉత్సాహంగా వినాయక నిమజ్జనం వేడుకలో పాల్గొని వినాయకున్ని కొత్తపల్లి చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ డైరెక్టర్ సందవేణి వెంకట్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 27 బ్యాంక్‌లకు సెలవు లేదు

ఆదివారం పని దినంగా ప్రకటించిన ఆర్బిఐ

కరీంనగర్ బిజినెస్, ప్రభాతవార్త : సెప్టెంబర్ 28 నుండి 30 వరకు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ తలపెట్టిన మూడు రోజుల దేశవ్యాప్త సమ్మె, దానికి ముందు వచ్చే వారాంతపు సెలవుల నేపథ్యంలో సెప్టెంబర్ 27న ఆదివారం అన్ని బ్యాంక్ శాఖలు, కార్యాలయాలు, ఏటీఎం అనుబంధ శాఖలు, కరెన్సీ చెస్ట్‌లు పూర్తిస్థాయిలో పనిచేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపినట్లు బుధవారం భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. బ్యాంకింగ్ రంగంలో వారానికి ఐదు పని దినాల విధానాన్ని ప్రవేశపెట్టాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ప్రధానంగా డిమాండ్ చేస్తోంది. సెప్టెంబర్ 30న జరిగే బ్యాంక్ ల అర్ధ వార్షిక ముగింపు దినాలలోనే ఈ బ్యాంక్ సమ్మె జరగనుంది. బ్యాంక్ వినియోగదారుల సంక్షేమం, సౌకర్యమే తమ అత్యంత ప్రాధాన్యత అని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రతిపాదిత సమ్మెను వాయిదా వేయాలని ప్రభుత్వం, బ్యాంక్ యాజమాన్యాలు యూనియన్ లకు విజ్ఞప్తి చేశాయి.



అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఉత్సాహభరితంగా గణనాథుల నిమజ్జనోత్సవం

కరీంనగర్ ఎడ్యుకేషన్, ప్రభాతవార్త : అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో శ్రీ విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభతో, అత్యంత వైభవంగా ముగిశాయి. గత తొమ్మిది రోజులుగా కొనసాగిన ఈ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున గణనాథుల నిమజ్జన మహోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది అత్యంత జోష్‌తో, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతీ రోజూ వేద బ్రాహ్మణుల సమక్షంలో శాస్త్రోక్తంగా వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానంగా కుంకుమార్చన, లింగార్చన మహా నైవేద్య సమర్పణ వంటి విశేష పూజలను విద్యా సంస్థల ప్రాంగణాల్లో అత్యంత వేడుకగా నిర్వహించినట్లు యాజమాన్యం తెలిపింది. ఈ నిమజ్జనోత్సవ వేడుకలకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ: విద్యాసంస్థల మండపాల్లో తొమ్మిది రోజుల పాటు గణపతికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో విద్యార్థులందరూ చదువులో రాణించి, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. భగవంతుని నామస్మరణతో ఆటంకాలు తొలగిపోతాయని, భక్తితో కూడిన పూజల వల్ల మానసిక ప్రశాంతత, ఆరోగ్యం శీఘ్ర అభివృద్ధి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో వివిధ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, నన్‌టీచింగ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.



కరీంనగర్‌లో ఘనంగా గణేష్ నిమజ్జనం.

పాతబజారు ఒకటో నంబరు గణపతి వద్ద వేడుకలను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్, గంగుల కమలాకర్.

కరీంనగర్, ప్రభాతవార్త : కరీంనగర్ నగరంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ముగింపు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పాతబజారు లోని చిన్న హనుమాన్ దేవస్థానం వద్ద ప్రతిష్ఠించిన ప్రసిద్ధ ఒకటో నంబరు గణపతి వద్ద రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి హనుమంతుడి పతాకాన్ని ఊపి గణేష్ నిమజ్జన శోభాయాత్రను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ ఖైరతాబాద్ గణపతి ఉత్సవాలకు 72 ఏళ్ల చరిత్ర ఉంటే, కరీంనగర్ పాతబజారులో పెంటయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఒకటో నంబరు గణపతి ఉత్సవాలు 80 ఏళ్లు పూర్తి చేసుకోవడం ఎంతో విశేషమని కొనియాడారు. గణనాథుడి ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. పాతబజారులోని ఒకటో నంబరు గణపతి వద్ద నుంచే నగరం మొత్తానికి నిమజ్జన వేడుకలను ప్రారంభించడం సుదీర్ఘకాలంగా వస్తున్న ఆనవాయితీ అని తెలిపారు. స్వామివారి శోభాయాత్ర పాతబజారు నుంచి టవర్ ప్రాంతం మీదుగా సాగుతుందని, టవర్ వద్ద ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జన పాయింట్‌కు తరలిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ చిత్తా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఉత్సవ సమితి సభ్యులు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



ఇల్లంతకుంటలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఇల్లంతకుంట మండల కేంద్రంతో పాటు ముస్కానిపేట గ్రామపంచాయతీ కార్యాలయంలలో ప్లాస్టిక్



రహిత సంచులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పాటుపడాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, సర్పంచులు రాజు, భాస్కర్ రెడ్డి, ఎంపీఓ వహీద్, ఉప సర్పంచ్ మూగు నాగరాజు శర్మ, వార్డు సభ్యులు మామిడి సుశీల, అంతటి శ్రీకాంత్ గౌడ్, నాయకులు వెంకన్న, ఎర్రోజు రవితేజ, దయ్యాల మహేష్, మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి వద్ద అన్నదానం ప్రారంభించిన కలెక్టర్..

ఉద్యోగులు, సిబ్బందికి స్వయంగా వడ్డించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద బుధవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని భోజన విరామ సమయంలో జిల్లా కలెక్టర్



గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, సందర్శకులకు కలెక్టర్ స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సీపీఓ శ్రీనివాసాచారి, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, డీఏఓ అష్ఫల్ బేగం, జిల్లా ఉద్యానవన అధికారి శరత్ బాబు, డీవైఎస్ఓ రాందాస్, కలెక్టరేట్ ఏవో, పర్యవేక్షకులు రాం రెడ్డి, శ్రీకాంత్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా గణనాథుల శోభాయాత్ర

గంగమ్మ ఒడిలోకి గణనాథులుఆది దేవునికి జనం నీరాజనాలు

ప్రభాతవార్త ఏటూర్ నాగారం సెప్టెంబర్ 23 :

మండల కేంద్రంలో గణనాథుల నిమజ్జన శోభాయాత్ర కన్నుల పండుగగా నిర్వహించారు. గణపతి నవరాత్రుల సందర్భంగా పలు ఆలయాల్లో మరియు ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక మండపాల్లో ఏర్పాటు చేసిన గణనాథులు తొమ్మిది రోజులపాటు భక్తులచే ధూప దీప నైవేద్యాలు, విశేష పూజలు అందుకుని బుధవారం అత్యంత శోభాయమానంగా భక్తుల కోలాటాలు, నృత్యాలు, మేల తాళాల నడుమ, అశేష జనవాహిని మధ్య పురవీధుల గుండా శోభాయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా భక్తజనం గణనాథులను దర్శించుకుని కోరిన కోరికలు నెరవేర్చాలని మ్రొక్కుతూ జనం ఆది దేవునికి నీరాజనం పట్టారు. అనంతరం పవిత్ర గోదావరి నది తీరమైన ములకట్ట బ్రిడ్జి సమీపంలో అధికారులు ఏర్పాటు చేసిన భారీ క్రేన్ల సహాయంతో గణనాథులు గంగమ్మ ఒడిలోకి చేరారు. నిమజ్జన ఏర్పాట్లను స్థానిక ఏఎస్పి మన్నన్ బట్ పర్యవేక్షించారు.

నేడు మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "దోస్త్" స్పాట్ అడ్మిషన్లు"

మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:

జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేడు, రేపు అనగా గురు, శుక్రవారం రోజుల్లో దోస్త్ ద్వారా డిగ్రీలో చేరడానికి స్పాట్ అడ్మిషన్ల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్య తెలిపారు. ఇంటర్మీడియట్, తత్సమాన కోర్సులలో ఉత్తీర్ణులై, ఇప్పటివరకు "దోస్త్" ద్వారా దరఖాస్తు చేసుకోని విద్యార్థులు మాత్రమే అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు వచ్చి స్పాట్ అడ్మిషన్లు తీసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్య విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ తొంటి దేవన్న, కళాశాల అకాడమిక్ కో ఆర్డినేటర్ బిల్ల రాజేందర్, కామర్స్ హెచ్ ఓ డి ఏ. మనోజ్ కుమార్ లతోపాటు లెక్చరర్లు, బోధ నేతల సిబ్బంది పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో వైభవంగా గణేష్ నిమజ్జనం

నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త:

మెట్‌పల్లి పట్టణంలో గణేష్ నిమజ్జనోత్సవాన్ని వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో బుధవారం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే గణనాథుల నిమజ్జనం కోసం వట్టి వాగు వద్ద అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. నిమజ్జన కార్యక్రమానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు

కలగకుండా పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి తెలిపారు. నిమజ్జనోత్సవం విజయవంతంగా జరిగేందుకు అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వట్టి వాగు వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలనచేసి అశోక్ కుమార్ వట్టి వాగు వద్ద నిమజ్జనానికి చేపట్టిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రతకు చేపట్టిన చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన శోభాయాత్రలు ప్రశాంతంగా జరిగేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసు, మున్సిపల్, రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లి వార్త



జర్నలిస్టులు మనోభావాలు దెబ్బతింటే జర ఆలోచించి క్షమించాలి

కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి

మల్లాపూర్ ప్రభాతవార్త :

ఇటీవల మాజీ ఎంపీపీ నల్ల రాజన్న అనే వ్యక్తి మండలంలోని సీనియర్ జర్నలిస్టుగా పనిచేస్తున్న రుద్ర రాంప్రసాద్ ఉద్దేశించి చేసిన దుర్భాషాలు సరికాదని, ఏమైన ఈ అంశంలో జర్నలిస్టుల మనోభావాలు దెబ్బతింటే కాంగ్రెస్ పార్టీ తరపున క్షమించాలని కోరుతూ సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి బుధవారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నేతల వ్యక్తిగత విషయాలు పార్టీకి పూయవద్దని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలో జడ్పీటీసీ పోటీ చేసిన సమయంలో పార్టీ పరిస్థితి అందరికి తెలుసాని కనీసం జెండాలు, కండువాలు పంపలేదని స్పష్టం చేశారు.



ప్రస్తుతం మండలంలోని చీమలు కష్టపడి పెట్టిన ఓ పుట్టలో పాము చోరబడిందని, సమయం వచ్చినప్పుడు వచ్చిన పాము చివరికి ఆ చీమలతోనే చనిపోతుందని వివరించడం స్థానికంగా చర్చనీయాశంగా మారింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

పుష్పలత చిత్రపటానికి నివాళులర్పించిన కవిత భర్త అనిల్

రఘు కుటుంబాన్ని పరామర్శించిన రాజకీయ, సామాజిక ప్రముఖులు

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త:

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘు మాతృమూర్తి చిట్నేని పుష్పలత ఇటీవల మృతి చెందగా, బుధవారం మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల రోడ్డులోని విదిత్‌రెడ్డి గార్డెన్‌లో ద్వాదశ దిన కర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోరుట్ల నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ సంఘాల ప్రతినిధులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై పుష్పలతకు నివాళులర్పించారు. పుష్పలతకు అనిల్ నివాళిటీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత భర్త అనిల్ కార్యక్రమానికి హాజరై పుష్పలత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ రఘు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పుష్పలత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. రాజకీయాలకు అతీతంగా తరలివచ్చిన నేతలుడాక్టర్ రఘు మాతృమూర్తి ద్వాదశ దిన కర్మకు నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై రఘు కుటుంబాన్ని పరామర్శించారు. పుష్పలత మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు. వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు సైతం కార్యక్రమానికి హాజరై నివాళులర్పించారు.



నెహ్రూ నగర్‌లో వైభవంగా గణనాథుడి పూజలు

సామూహిక కుంకుమార్చన,

అన్నదాన కార్యక్రమాలు

ముఖ్య అతిథిగా హాజరైన

డీఎస్పీ నాగేంద్ర చారి

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:

సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ నగర్‌లో వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. నెహ్రూ యువ మిత్ర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద ఉదయం



మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సకల శుభప్రదమైన సామూహిక కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ వేడుకలకు సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండుగలు సమాజంలో సోదరభావం, శాంతి సామరస్యాలను పెంపొందిస్తాయని, యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉత్సవాలను అంతా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు, నెహ్రూ యువ మిత్ర సంఘం ప్రతినిధులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

పదవి మహిళలది.... పెత్తనం భర్తలది!

అధికారిక కార్యక్రమాల్లోనూ భర్తలే హాజరు

మహిళా సాధికారతకు విఘాతం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు సర్పంచులుగా ఎన్నికైనప్పటికీ పాలనలోవారి భర్తల జోక్యం పెరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.గ్రామ పాలనలో కీలక నిర్ణయాలు సర్పంచులుగా ఉన్న మహిళల కంటే వారి భర్తలే తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది..

మహిళలకు పురుషులతో సమానంగా హక్కులు,అవకాశాలు కల్పిస్తూ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోంది.స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారు పాలనలో కీలక పాత్ర పోషించేలా అవకాశం కల్పించింది.అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

అధికారిక కార్యక్రమాల్లోనూ భర్తల హవా..

గ్రామాల్లో నిర్వహించే పలు అధికారిక కార్యక్రమాలు, సమావేశాలు,ప్రభుత్వ కార్యక్రమాలకు మహిళా సర్పంచుల స్థానంలో వారి భర్తలు హాజరవుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి.కొన్నిచోట్ల అధికారులు సైతం సర్పంచుల భర్తలతోనే వ్యవహారాలు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

నిర్ణయాలు ఎవరు తీసుకుంటున్నారు?..

గ్రామాల్లో అభివృద్ధి పనులు, పారిశుద్ధం, తాగునీరు ,వీధిదీపాలు తదితర అంశాల్లో సర్పంచులు ప్రజలతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.కానీ కొన్ని గ్రామాల్లోఈ వ్యవహారాల్లో భర్తల జోక్యం ఎక్కువగా ఉందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.దీంతో మహిళలు కేవలం పదవికి పరిమితమవుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మహిళలకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేయాలి..

ప్రజలచే ఎన్నికైన సర్పంచులు గ్రామ పాలనపై అవగాహన పెంచుకుని స్వయంగా నిర్ణయాలు తీసుకునేలా అధికారులు ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు .మహిళా సర్పంచులకు పాలన,నిధులు,అభివృద్ధి కార్యక్రమాలపై అవసరమైన శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

పేరుకే పదవి.. పెత్తనం భర్తలదేనా?

మహిళా సర్పంచ్ స్థానంలో అధికారిక కార్యక్రమాలకు భర్తలు హాజరవడం వల్ల మహిళలకు ఇచ్చిన ప్రాతినిధ్యం ఉద్దేశం దెబ్బతింటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.సర్పంచ్‌గా ఎన్నికైన మహిళలే గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.మహిళా సాధికారత కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలోనూ అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

అధికారుల పర్యవేక్షణ అవసరం

అధికారిక సమావేశాలు,గ్రామసభలు,అభివృద్ధి కార్యక్రమాల్లోమహిళా సర్పంచులే పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సర్పంచుల భర్తలు సహకారంగా ఉండాలి తప్ప అధికారిక నిర్ణయాల్లో జోక్యం చేసుకోకూడదని పలువురు సూచిస్తున్నారు. మహిళలకు కల్పించిన రాజ్యాంగబద్ధమైన ప్రాతినిధ్యాన్ని గౌరవించి,గ్రామ పాలనలో వారికి పూర్తి స్థాయి అవకాశం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జిల్లెల్లలో రైతుల ధర్నా

భూమి మాది..సాగు మాది..

రైతుబంధు ఎందుకు ఇవ్వరంటూ రోడ్డెక్కిన అన్నదాతలు..

తంగళ్లపల్లి,ప్రభాత వార్త..

తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో దళిత రైతులు ప్రధాన రహదారిపై బైఠాయించి వినూత్న నిరసనకు దిగారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తమకు కేటాయించిన భూముల పట్టాలను ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులను అడ్డం పెట్టుకుని రద్దు చేయించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.గత ప్రభుత్వ హయాంలో మాకు భూములు ఇచ్చారు, రైతుబంధు కూడా వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆన్‌లైన్‌లో మా భూముల వివరాలు కనిపించడం లేదు, రైతుబంధు కూడా రావడం లేదు.అడిగితే మా సీఎం వస్తుండు..మీ భూములు గుంజుకుంటాం అంటూ కాంగ్రెస్ నాయకుడు బెదిరిస్తున్నాడు అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.రాజకీయ పగలు ఉంటే మీరూ మీరూ చూసుకోండి.. మా దళితుల భూముల మీద ఎందుకు పగ పెంచుకుంటుర్రు? మా పొట్టకొట్టే రాజకీయాలు చేయొద్దు అంటూ కాంగ్రెస్ నాయకులను రైతులు నిలదీశారు. ఆన్‌లైన్‌లో భూముల వివరాలు లేకపోవడంతో యూరియా బస్తాలు కూడా రావడం లేదని



భూమి మాది.. సాగు మాది.. మరి ఆన్‌లైన్‌లో మా భూమి ఉన్నా రైతుబంధు ఎందుకు ఇవ్వరు అని ప్రశ్నించారు.తమ పట్టాలను వెంటనే పునరుద్ధరించాలని,తమకు న్యాయం చేయాలని మా పట్టాలు ఇవ్వాలి సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.తమ సమస్యను పరిష్కరిం చకుండా కాలయాపన చేస్తే భవిష్యత్తులో మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతులు తదితరులు పాల్గొన్నారు..

సర్వీస్ కోసం సర్వే నిర్వహించిన డిపో మేనేజర్

ముస్తాబాద్ ప్రభాత వార్త:

ముస్తాబాద్ మండలం చి కోడ్ గ్రామములో ప్రయాణికుల సౌకర్యార్థం రోడ్డు మార్గాన్ని పరిచిలించడానికి సిద్దిపేట ఆర్టీసీ అధికారి బుధవారం సర్వే నిర్వహించి సర్పంచ్ బొమ్మెన ఆంజనేయులు రూట్ మ్యాప్ గురించి అధికారికి వివరించారు. ఈ కార్యక్రమములో ఆర్టీసీ సిబ్బంది,గ్రామ పాలక వర్గం, ఉపసర్పంచ్ రజినీకాంత్,గ్రామస్తులు పాల్గొన్నారు.



సిరిసిల్ల వార్త



టై బెల్ట్ ఐడీ కార్డుల పంపిణీ

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :



సిరిసిల్ల పట్టణంలోని నెహ్రు నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు పాఠశాలలో ని విద్యార్థులకు టై బెల్టులు గుర్తింపు కార్డులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు కొక్కుల తిరుపతి, గడ్డం ఆంజనేయులు, అన్నల్దాస్ సత్యనారాయణ, ఊషకోయల మనోహర్ లు చదివిన పాఠశాలకు వారి సహాయంగా దాదాపు 600 మంది విద్యార్థులకు బెల్టులు , గుర్తింపు కార్డులను అందజేశారు. కష్టపడి జీవితం లో ప్రయోజకులైన పూర్వ విద్యార్థులు ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థులకు తోడ్పాటు అందించాలనే సంకల్పంతో గత ఏడు సంవత్సరాలుగా పాఠశాలకు సహాయసహకారాలు అందిస్తున్నతీరు అభినందనీయమన్నారు . ఈ కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయుడు షేక్ ఖాజా మోహియోద్దీన్ ఉపాధ్యాయులు , విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే చిన్నారులకు ఆరోగ్యకర భవిష్యత్తు

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సీడీపీవో ఉమారాణి,

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:

సంజీవయ్యనగర్2 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన 'పోషణ్ మా' కార్యక్రమంలో సీడీపీవో ఉమారాణి మాట్లాడారు. 'మా అంగన్‌వాడీ మా బాధ్యత'లో భాగంగా చిన్నారులకు చిన్నతనం నుంచే పౌష్టికాహారం అందించడం ద్వారా వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు ప్రతినెలా బరువు తూకం వేయించాలని, గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిశువు ఎదుగుదలలో తొలి వెయ్యి రోజులు అత్యంత కీలకమని వివరించారు.అనంతరం కౌన్సిలర్ నెల్లుట్ల నరేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని, 3 నుంచి 5 ఏళ్ల పిల్లలను కేంద్రాలకు పంపించాలని కోరారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, మూడేళ్ల నిండిన చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ టి. అంజలి, అంగన్‌వాడీ కార్యకర్త పి. శోభారాణి, సహాయకురాలు ఎస్. భాగ్య, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



గణేష్ నిమజ్జనోత్సవానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు పూర్తి

: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,
గణేష్ శోభాయాత్ర మార్గాల్లో సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
జిల్లా వ్యాప్తంగా 700 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు
డి.జే లకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేదు
రీల్స్, సెల్ఫీల పేరుతో ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలి



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించనున్న గణేష్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా జగిత్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, తెలిపారు. జిల్లావ్యాప్తంగా గణేష్ నిమజ్జనోత్సవాల సందర్భంగా సుమారు 700 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.జిల్లా పరిధిలోని ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో జరిగే గణేష్ నిమజ్జన కార్యక్రమాలపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని, శోభాయాత్రలు వెళ్లే మార్గాలు, ప్రధాన కూడళ్లు, నిమజ్జన ప్రాంతాలు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో పోలీసు సిబ్బందిని మోహరించడంతో పాటు సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకునేలా పోలీస్ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.నిమజ్జన ప్రాంతాల్లో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన చోట భారీ క్రేన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిమజ్జనం సందర్భంగా నీటిలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా స్థానిక గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.గణేష్ శోభాయాత్రలు సజావుగా సాగేందుకు ట్రాఫిక్ నియంత్రణపై కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. శోభాయాత్ర మార్గాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు, బారికేడింగ్ వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. శోభాయాత్ర సమయంలో అత్యవసర వాహనాలకు, అంబులెన్స్‌లకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిర్వాహకులు సహకరించాలని కోరారు.డి.జే లకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేదు: డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్స్ వినియోగం విషయంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని,అధిక శబ్దం వల్ల వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు, విద్యార్థులు, ఇతర ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. పోలీసుల సూచనలకు విరుద్ధంగా వ్యవహరించడం, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడటం, నిబంధనలు ఉల్లంఘించడం వంటి వాటిని అనుమతించబోమని స్పష్టం చేశారు.రీల్స్, సెల్ఫీల పేరుతో ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలి: గణేష్ శోభాయాత్ర సమయంలో రీల్స్, సెల్ఫీలు తీసుకునే క్రమంలో ప్రమాదకరంగా వాహనాలపైకి ఎక్కడం, క్రేన్లు లేదా విగ్రహాలపైకి ఎక్కడం, నీటి ప్రాంతాల వద్ద ప్రమాదకరంగా సెల్ఫీలు తీసుకోవడం, వాహనాల కదలికలకు అడ్డుగా నిలబడటం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వీడియోలు, రీల్స్ కోసం తమ ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.శోభాయాత్ర సమయంలో యువత అత్యుత్సాహానికి గురికాకుండా సంయమనం పాటించాలని, మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనవద్దని, వాహనాలను నిర్లక్ష్యంగా లేదా వేగంగా నడపవద్దని సూచించారు. ముఖ్యంగా గణేష్ విగ్రహాలను తరలించే వాహనాలపై అధిక సంఖ్యలో వ్యక్తులు ప్రయాణించకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.గణేష్ నిమజ్జనోత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక తదితర శాఖలతో సమన్వయంతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు.పోలీసు అధికారులు, సిబ్బంది 24 7 అప్రమత్తంగా ఉంటూ ప్రతి ప్రాంతంలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే స్పందించేలా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీసులకు సహకరించాలని శోభాయాత్ర సమయంలో క్రమశిక్షణ పాటిస్తూ, నిర్ణయించిన మార్గాల్లోనే విగ్రహాలను తరలించాలని సూచించారు. ప్రతి ఒక్కరి సహకారంతో గణేష్ నిమజ్జనోత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా జిల్లా పోలీస్ శాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని తెలిపారు.

ఇందిరమ్మ హౌసింగ్, బలహీన వర్గాల పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వేగవంతం

గోదావరి పుష్కరాలు-2027కు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి
వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి
జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: జిల్లాలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓలు, హౌసింగ్ ఏఈలు తదితర అధికారులతో వినాయక నిమజ్జన ఏర్పాట్లు, బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకానికి సంబంధించిన పట్టాలు/పొజిషన్ సర్టిఫికెట్ల పంపిణీ, గోదావరి పుష్కరాలు-2027 సన్నద్ధతపై సమీక్షించారు.వినాయక నిమజ్జన ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలను అధికారులు ముందుగానే పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో బారికేడ్లు, విద్యుత్ దీపాలు, తాగునీరు, పారిశుధ్యం, క్రేన్లు, గజ ఈతగాళ్లు, వైద్య బృందాలు, అగ్నిమాపక వాహనాలు తదితర ఏర్పాట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. జిల్లాలో బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకం కింద అందుబాటులో ఉన్న 29,134 పట్టాలు /పొజిషన్ సర్టిఫికెట్లను సంబంధిత రికార్డులతో క్షుణ్ణంగా సరిచూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే లబ్ధిదారులకు అందజేసినవి, ప్రస్తుతం అందుబాటులో ఉన్నవి, ఇంకా పంపిణీ చేయాల్సిన వాటి వివరాలను మండలాలు, మున్సిపాలిటీల వారీగా నిర్ధారించా లన్నారు. అర్హులైన లబ్ధి దారులను గుర్తించి త్వరి తగతిన పూర్తి చేయాలని సూచించారు. నివేదికల్లో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా తహసీల్దార్లు వ్యక్తిగతంగా పరిశీలించి ధ్రువీకరించాలని స్పష్టం చేశారు.గోదావరి పుష్కరాలు-2027కు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పుష్కర ఘాట్లు, చేరుకునే రహదారులు, పార్కింగ్ ప్రదేశాలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల వసతి తదితర అవసరాలను గుర్తించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, అంచనాలు సిద్ధం చేసి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

జగిత్యాల వార్త



గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ ధర్మారం గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మండపం వద్ద భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గోస్కుల గంగాధర్,గుండారపు భూషణం,వెల్పుల శివ,బల్లూరి రాజు,కోరేపు రాజ్‌కుమార్,ఊదరపు రాజు శేఖర్,వి.నవీన్, గోస్కుల మహేష్,సతయ్య డోరా,గోస్కుల రాజు, కట్టా శేషి,మురళీధర్ రావు,జగన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పోలాసలో ఉత్సాహంగా పోషణ మాస వేడుకలు

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ పోలాస గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు వివిధ రకాల పోషణ ఆటలను నిర్వహించారు.వీటిలో ప్రతిభ కనబరిచిన మహిళలను విజేతలుగా ప్రకటించి గ్రామ సర్పంచ్ మిల్కూరి శరణ్య బహుమతులతో సత్కరించారు.అలాగే నిత్యం సమతుల్య ఆహారం,ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ ఉపాధ్యాయులను ఖిపోషణ ఛాంపియన్లుఖిగా గుర్తించి ప్రత్యేకంగా సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మిల్కూరి శరణ్య మాట్లాడుతూ,పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,కుటుంబ ఆరోగ్యానికి సమతుల్య ఆహారమే పునాది అని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు పవిత్ర, ఉపసర్పంచ్ సంఘు తిరుపతి,వార్డు సభ్యుడు నీలకంఠం, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు మమత, ప్రభావతి,ఉష, గంగాజల, శారదలతో పాటు తల్లులు, గ్రామ ప్రజలు,చిన్నారులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలోవైభవంగా గణేష్ ఉత్సవాలు

. నిమజ్జనం వద్ద భక్తులకు అన్ని వసతులు కల్పించాం..

మానకొండూర్ లో గణేష్ నిమజ్జనాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం, ఎమ్మెల్యేలు .

. హైదరాబాద్ లో 25న, నిమజ్జనం.

.మానకొండూర్, ప్రభాతవార్త :



గణేష్ నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని ప్రజా పాలన ప్రభుత్వంలో గణేష్ నిమజ్జనాల వద్ద భారీ ఏర్పాట్లు చేశామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం మానకొండూరు ఎమ్మెల్యేలు డా. కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మానకొండూరు చెరువులో నిర్వహించే గణేష్ నిమజ్జనాన్ని కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా భారీ వసతులు కల్పించినట్లు వివరించారు. అన్ని మండపాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందజేశామని అన్నారు. మానకొండూరు చెరువులో జరిగే నిమజ్జన కార్యక్రమంలో ప్రజలు, భక్తులు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. గా నేడు నిమజ్జనోత్సవం జరుగుతోందని, ఒక హైదరాబాద్ లో మాత్రం ఈనెల 25వ తేదీన నిమజ్జనం జరుగుతుందన్నారు. మానకొండూరు చెరువులో జరిగే గణేష్ నిమజ్జనానికి కరీంనగర్ తిమ్మాపూర్ మానకొండూరు మండలాల నుండి వందలాది విగ్రహాలు తరలిరానున్న దృశ్య అధికారులు చెరువు వద్ద భారీ ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. చెరువు కట్ట సమీపంలో రెండు భారీ క్రేన్లు, హనుమాన్ టెంపుల్ సమీపంలో మరో రెండు చిన్న క్రేన్ల ద్వారా నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు. మానకొండూరులో కురిసిన భారీ వర్షానికి నిమజ్జన కార్యక్రమం కొంత అంతరాయం ఏర్పడింది. మానకొండూరులో జరిగే గణేష్ నిమజ్జనం అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, డిప్యూటీ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బండి రాజేశ్వరి, ఆర్డీఓ షర్మిల, తాసిల్దారులు విజయ్ కుమార్, ఎంపీడీవో వరలక్షి మ్మ, సీఐలు శ్రీలత, బొల్లం రమేష్, విద్యుత్ శాఖ సిఎల్పి రాజు, డిఈ తిరుపతి, ఏఈ సత్యనారాయణ, ఎస్సై తిరుపతి, ఆర్ఐ అశోక్, ప్రీతి, మండల నాయకులు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, ముద్దసాని శ్రీనివాసరెడ్డి, మర్రి ఓదెలు, తిరుమల్ రెడ్డి, బుర్ర శ్రీధర్ గౌడ్, రామిడి శ్రీనివాస్ రెడ్డి, రెవె ల్లి రాజలింగం, ప్రేమ్ కుమార్, సురేష్, గసి గంటి సంపత్, బుర్ర శ్రీకాంత్, అధికారులు మండల నాయకులు పాల్గొన్నారు

వేలంపాటలో లడ్డును 52 వేలకు దక్కించుకున్న తుమ్మనపల్లి.

.తిమ్మాపూర్, ప్రభాత వార్త



:తిమ్మాపూర్ మండలం నుస్తూలాపూర్ గ్రామంలోని శ్రీ భవాని సహిత శంకర్ హనుమాన్ దేవాలయంలో 52 వేల రూపాయల వేలంపాటలో వినాయక లడ్డు ప్రసాదములు దక్కించుకున్న తిమ్మాపూర్ మండల్ మాజీ వైస్ ఎంపీపీ తుమ్మనపల్లి శ్రీనివాసరావు కార్యక్రమంలో గుడి చైర్మన్ పాలకవర్గ సభ్యులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా నుస్తూలాపూర్ రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా నిలవాలని భగవంతుని కోరుకున్నాడు

ఘనంగా గణేష్ నిమజ్జనం..

మానకొండూర్, ప్రభాతవార్త:



మానకొండూరు మండలంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం గణేష్ నిమజ్జనాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల ప్రజలు తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేపట్టి, గణేష్ విగ్రహాన్ని వాహనంలో ఏర్పాటు చేసి ర్యాలీగా బయలుదేరి మహిళలు కోలాటాలతో, నృత్యాలు చేపడుతూ మానేరు, చెరువుల్లో నిమజ్జనాన్ని శాంతియుతంగా జరుపుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనాలకు పటిష్ట చర్యలు:

మంత్రి పొన్నం ప్రభాకర్

తిమ్మాపూర్, ప్రభాత వార్త

:వినాయక నిమజ్జనాలు సజావుగా, ప్రశాంతంగా సాగేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. తెలిపారు.కరీంనగర్‌లోని ఎల్ఎండీ కాలనీ ప్రజాభవన్‌లో గణేష్ నిమజ్జనానికి ముందు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు.రాష్ట్రవ్యాప్తంగా బుధవారం అన్ని జిల్లాల్లో జరుగుతున్న గణేష్ నిమజ్జనాలతో పాటు, ఈనెల 25న హైదరాబాద్‌లో.. జరిగే భారీ నిమజ్జనోత్సవానికి కూడా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిమజ్జనాల నిర్వహణకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.వినాయక మండపాల ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించిందని, మండపాలకు ఉచిత విద్యుత్ సహా అన్ని సౌకర్యాలు కల్పించామని వివరించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిమజ్జనోత్సవాలను జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సహకరించాలని కోరారు.రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు.

కరీంనగర్ వార్త



ప్రత్యేక అవసరాల పిల్లలకు అండగా న్యాయ సేవా అధికార సంస్థ



మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలను సందర్శించిన

సీనియర్ సివిల్

న్యాయమూర్తి యశ్వంత్ సింగ్

తిమ్మాపూర్, ప్రభాత వార్త

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్య, వృత్తి నైపుణ్యాలతో పాటు వారి హక్కులపై అవగాహన కల్పించడం ద్వారా వారిని సమాజంలో గౌరవప్రదమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన జీవనం సాగించేలా ప్రోత్సహించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి యశ్వంత్ సింగ్ అన్నారు. కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎల్.ఎం.డి. కాలనీలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల, వృత్తి శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధన, వృత్తి శిక్షణ, ఇతర కార్యక్రమాలను పరిశీలించారు. విద్యార్థులతో న్యాయమూర్తి ఆత్మీయంగా మాట్లాడి, వారి రోజువారీ కార్యకలాపాలు, విద్య, శిక్షణ తదితర అంశాలను తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాలలోని మౌలిక వసతులు, వృత్తి శిక్షణ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పట్ల సమాజం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. వారికి సమాన అవకాశాలు, విద్య, నైపుణ్యాభివృద్ధి, హక్కుల పరిరక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వృత్తి శిక్షణ ద్వారా పిల్లల్లో స్వయం ఆధారిత జీవనానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులకు చట్టపరంగా కల్పించిన హక్కులు, ఉచిత న్యాయ సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ తరపున అవసరమైన సహకారం అందిస్తామని యశ్వంత్ సింగ్ తెలిపారు. పిల్లల అభివృద్ధి కోసం ట్రస్ట్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. విద్యార్థులతో కొంత సమయం గడిపి వారిని ఉత్సాహపరిచారు. చక్కని పాటలు పాడిన విద్యార్థులకు పెన్నులను బహూకరించినారు.కత్తి కంటే కలం శక్తివంతమైనదని, కలం సమాజంలో చైతన్యాన్ని నింపి, వ్యక్తులను సన్మార్గంలో నడిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు ఏ. కిరణ్ కుమార్, పెరుక రంగయ్య, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎలుగు తణ్మయి, ప్యానెల్ న్యాయవాది నజీమా సుల్తాన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం. సతీష్ లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు...!

వర్షంతో నిమజ్జన వేడుకలు ఆలస్యం... నీరసించిన యూత్ సభ్యులు

హుజురాబాద్ నియోజకవర్గంలో కన్నులపండువగా శోభాయాత్రలు

పటిష్ట బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసిన ఘట్టం

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు వాడవాడలా భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న విఘ్నేశ్వరుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరాడు. పల్లె, పట్నం అనే తేడా లేకుండా కులమతాలకు అతీతంగా నియోజకవర్గంలోని జమ్మికుంట, హుజురాబాద్, కమలాపూర్, ఇల్లందకుంట, వీణవంక మండలాల్లో నిమజ్జనోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

కన్నులపండువగా శోభాయాత్రలు...

నవరాత్రుల పాటు స్వామివారికి పులిహోర, పాయసం తదితర నైవేద్యాలు సమర్పించిన భక్తులు, మంటపాలకు సహకరించిన దాతల ఇళ్లకు వెళ్లి ప్రసాదాలు అందజేశారు. బుధవారం మధ్యాహ్నం నుంచి గణనాథుని శోభాయాత్రలు అట్టహాసంగా ప్రారంభం కావాల్సి ఉండగా వర్షం అడ్డంకిగా మారింది. ట్రాక్టర్లు, టాటా ఏసీలు, ఐషర్ వాహనాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి విగ్రహాలను ఊరేగించారు. జమ్మికుంట గాంధీచౌక్, హుజురాబాద్ అంబేద్కర్ చౌక్, కమలాపూర్ బస్టాండ్, ఇల్లందకుంట రాములోరి ఆలయం, వీణవంక ఆర్టీసీ బస్టాండ్ల వద్ద భక్తులు వినాయక విగ్రహాలకు ఘనంగా స్వాగతం పలికారు.

వర్షంతో ఆలస్యం.. నీరసించిన యూత్.....

హుజురాబాద్ పట్టణంలో మధ్యాహ్నం నుండి వర్షం పడుతుండంతో నిమజ్జన కార్యక్రమం అనుకున్న సమయం కంటే బాగా ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం నుంచే డీజే చప్పుళ్ల మధ్య ఎంతో ఉత్సాహంగా డాన్సులు చేస్తూ సంబురాలు జరుపుకునేందుకు సిద్ధమైన యూత్ సభ్యులు.. వర్షం కారణంగా నిరీక్షి ంచాల్సి రావడంతో కాస్త నీరసించిపోయారు. అయినప్పటికీ వాతావరణం అనుకూలించడంతో తిరిగి ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొన్నారు. హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని తొలి వినాయక నిమజ్జనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), మున్సిపల్ కమిషనర్ లు కిషన్, జి. మల్లికార్జున స్వామి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పోలీసు బందోబస్తు...

నిమజ్జనోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రధాన కూడళ్లలో భారీ బారికేడ్లు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి ఆధ్వర్యంలో జమ్మికుంట సిఐ ఎస్. రామకృష్ణ గౌడ్, పులి వెంకట్, హుజురాబాద్ టౌన్ సిఐ కరుణాకర్ ఐదు మండలాల పరిధిలో పటిష్టమైన పోలీసు బందోబస్తు నిర్వహించారు. "జై జై గణపయ్యా.. వెళ్లి రావయ్యా.. మళ్లీ రావయ్యా" అంటూ భక్తులు చేసిన నామస్మరణ మధ్య స్థానిక చెరువులు, కుంటల్లో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది.



మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండా మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, ప్రభాత వార్త:

సైదాపూర్ మండలంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాలలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని వారికి పార్టీతో పాటు తాను అండగా ఉంటామని తెలిపారు. కాగా దుద్దెనపల్లిలో కుందేళ్ల కనకమ్మ, అప్పిడి సుభద్ర, బోరగల్ల పోచమ్మ కుటుంబాలను, సైదాపూర్ మండల కేంద్రంలో అనగొని రవీందర్ గౌడ్, మొలగూరి వసంత కుటుంబాలను, సోమారంలో కోల లావణ్య, బూడిద వీరమ్మ కుటుంబాలను వారి నివాసాలకు వెళ్లి మంత్రి పరామర్శించి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, అవసరమైన సమయంలో అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ దొంత సుధాకర్, మార్కెట్ వైస్ ప్రెసిడెంట్ నాదెండ్ల రాజ్ కుమార్, వెన్నంపల్లి పిఏసిఎస్ చైర్మన్ పంతంగి రవిందర్, మాజీ సింగల్ విండో చైర్మన్ సారబుడ్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు వేముల సాయి కుమార్, సర్పంచులు మునిగంటి స్వప్న సంతోష్, కందుల అనిత అంజి, గోపగోని నవీన్, బొమ్మగాని రాజు, మ్యాకల రాజు, పిట్టల రాకేష్, కొంపెల్లి ప్రశాంత్ రెడ్డి, మండలంలోని ఆయా గ్రామ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ఆయా గ్రామ శాఖల అధ్యక్షులు, మార్కెట్ కమిటి, సొసైటి డైరెక్టర్లు, పార్టీ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ నాయకులు, ఎన్.ఎస్.యు.ఐ, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, బిసి సెల్, మైనారిటీ సెల్, కిసాన్ సెల్ అధ్యక్షులు, సోషల్ మీడియా విభాగాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కమలాపూర్‌లో టీబీ నిర్ధారణకు సీబీనాట్ యంత్రం ఏర్పాటు దిశగా అడుగులు

కమలాపూర్: ప్రభాత వార్త

.కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ (టీబీ) నిర్ధారణ పరీక్షలను వేగవంతం చేసేందుకు సీబీనాట్ యంత్రాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.ఇందులో భాగంగా హనుమకొండ ఇన్‌చార్జ్ డీటీసీఓ, డిప్యూటీ డీఎం !! హెచ్ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, సీహెచ్ఓ మాధవరెడ్డి కలిసి కమలాపూర్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సీబీనాట్ యంత్రం ఏర్పాటుకు అవసరమైన గది, విద్యుత్ సౌకర్యం, ఇతర వసతులను పరిశీలించారు. టీబీ అనుమానితులకు సకాలంలో నిర్ధారణ పరీక్షలు చేసి, త్వరితగతిన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గణేష్ నిమజ్జనం నేపథ్యంలో తీసుకోవాల్సిన వైద్య, పారిశుద్ధ్య ఏర్పాట్లపై అధికారులు సమీక్షి ంచారు. నిమజ్జన సమయంలో భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీరు, పారిశుద్ధం, అత్యవసర మందుల నిల్వలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.ఈ పర్యటనలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ చందు నాయక్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ అమృత, పల్లె దవాఖాన వైద్యురాలు డాక్టర్ రమ్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు."టీబీ రహిత సమాజం కోసం సకాలంలో నిర్ధారణ సమర్థవంతమైన చికిత్స" లక్ష్యంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని అధికారులు తెలిపారు.



హుజురాబాద్ వార్త

మారుతినగర్ మహా గణపతిని దర్శించుకున్న అడిషనల్ కలెక్టర్

కేసీ కెనాల్ వద్ద నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

హుజురాబాద్ పట్టణంలోని మారుతినగర్ లో ప్రతిష్టించిన భారీ వినాయకుడిని బుధవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీస్సులు పొందారు. పూజా కార్యక్రమాల అనంతరం





హుజురాబాద్ పట్టణ శివారులోని కేసీ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన ప్రాంతాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం చేసిన ముందస్తు ఏర్పాట్లను పర్యవేక్షించి, ప్రక్రియ సజావుగా సాగేందుకు పలు కీలక సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో హుజురాబాద్ ఆర్డీఓ నాయక్ వాడి జలకుమారి, మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, తహశీల్దార్ జక్కని నరేందర్, మున్సిపల్ కమిషనర్ బి. కిషన్, కౌన్సిలర్ తాళ్లపల్లి రమేష్ గౌడ్, మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి, ఆర్ఐ డి. కిరణ్, మంటప నిర్వాహకుడు మోటపోతుల వినయ్ తో పాటు వైద్య ఆరోగ్య శాఖ, ఇరిగేషన్ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శనిగరం బస్టాండ్‌లో ఉచిత హోమియో వైద్య శిబిరం

కమలాపూర్: ప్రభాతవార్త.

11వ ఆయుర్వేద దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శనిగరం బస్టాండ్‌లో బుధవారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ డా. కె. ఝాన్సీ ప్రియాంక ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలి, వ్యాధుల నివారణలో హోమియోపతి ప్రాముఖ్యతను వివరించారు. శిబిరానికి వచ్చిన వారికి అవసరమైన ఉచిత హోమియో మందులను పంపిణీ చేశారు.ఈ శిబిరంలో యోగా శిక్షకులు పద్మ, చంటి పాల్గొని నిత్య జీవితంలో యోగా ప్రాముఖ్యతను వివరించారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు.ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.



జూనియర్ న్యాయవాదులకు
నెలకు రూ.10 వేల భృతి ఇవ్వాలి
జీవన భృతి.. ఆరోగ్య భద్రతమోలిక వసతులకు ఐక్య పోరాటం

గోదావరిఖని,ప్రభాత వార్త: జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేల జీవన భృతి ఇవ్వడంతో పాటు హెల్త్ కార్డు పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలని, న్యాయవాది మరణిస్తే కుటుంబానికి అందించే ఆర్థిక సాయాన్ని రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. జాతీయ కౌన్సిల్ పిలుపు మేరకు సమస్యల దినోత్సవంలో భాగంగా బుధవారం గోదావరిఖనిలో ఈ కార్యక్రమం చేపట్టారు.న్యాయవాదుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా వృత్తిలోకి వస్తున్న జూనియర్ న్యాయవాదులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు పేర్కొన్నారు. వృత్తిలో స్థిరపడే వరకు వారికి ప్రభుత్వం కనీస ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. న్యాయవాదుల సంక్షేమాన్ని బలోపేతం చేయడం ద్వారా న్యాయవ్యవస్థలో కీలకంగా పనిచేస్తున్న వారికి భద్రత కల్పించినట్లవుతుందని అన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న హెల్త్ కార్డు పరిమితి రూ.2 లక్షలు ఉండగా, పెరుగుతున్న వైద్య ఖర్చులను దృష్టిలో ఉంచుకుని దాన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. న్యాయవాది మరణించిన సందర్భంలో ప్రస్తుతం అందిస్తున్న రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని రూ.25 లక్షలకు పెంచి కుటుంబానికి అండగా నిలవాలని కోరారు.అన్ని కోర్టుల్లో న్యాయవాదులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ధర్నాలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఉమర్, గోదావరిఖని పట్టణ అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్,



సీనియర్ సభ్యులు దాదా సాలం, సంతోష్, ఎం.డి. అసిఫ్, బొల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి నిమజ్జన శోభాయాత్ర.



ఓదెల,ప్రభాతవార్త: ఓదెల మండలం లో వివిధ గ్రామాలలో బుధవారం గణపతి నిమజ్జన శోభాయాత్రను భక్తు లు ఘనంగా నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండ పాల వద్ద కమిటీ సభ్యులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథు డికి ఘనంగా వీడ్కోలు పలికారు. నిమజ్జనానికి ముందు గణపతి విగ్రహా లను ట్రాక్టర్లపై విద్యుత్ దీపాలు, పూలమాలలతో అంగరంగ వైభవంగా అలంకరించారు. ఓదెలలో సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ ఉప సర్పంచ్ గోపతి శ్రీలత ప్రవీణ్ పాలకవర్గ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయక సాగర్ లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ప్రమాదాలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై సనత్ రెడ్డి తెలిపారు.



జన్మదిన వేళ కేటీఆర్‌ను కలిసిన కోరుకంటి చందర్

గోదావరిఖని, ప్రభాత వార్త: జన్మదిన వేళ రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం తెలం గాణ భవన్‌లో కేటీఆర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.ఈ సంద ర్భంగా కేటీఆర్ చందర్‌ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర సింహస్వామి ఆలయంలో నిర్వహిం చిన ప్రత్యేక పూజల పవిత్ర ప్రసాదాన్ని చందర్ కేటీఆర్‌కు అందజేశారు.



ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

అంతర్గాం, ప్రభాత వార్త : రామగుండం పట్టణం లో రైల్వే స్టేషన్ సమీపాన గల తబితా ఆశ్రమంలో బుధవారం రామగుండం మాజీ ఎమ్మెల్యే, బి.ఆర్. ఎస్.పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు బి. ఆర్. ఎస్. పార్టీ రామగుండం పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణి చేసిన అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమం లో బి. ఆర్. ఎస్. నాయకులు మాడిశెట్టి రవీందర్, కరివేద శ్రీనివాస్ రెడ్డి, ఉప్పరి లక్ష్మణ్, అర్షనపల్లి రాజు, గుమ్ముల నవీన్, ఈదునూరి నర్సింగ్, జగన్ మోహన్ రావు, ఖలీల్ పాషా, మాచర్ల నరేష్, అవునూరి రాజేష్, ఆసాది వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు...

గణేష్ నిమజ్జనం ప్రశాంతం



కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త: నవరా త్రుల పాటు భక్తిశ్రద్ధలతో కొలిచిన గణ నాథుల నిమజ్జన వేడుకలు మండల కేంద్రంతో ఆయా గ్రామాలలో కన్నుల పండువగా జరిగాయి. భక్తుల జైకారా లతో. తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజలందుకున్న వినాయక స్వామిని సాగనంపే క్షణం కన్నుల పండువగా జరిగింది. జోరు వర్షం పడుతున్న భక్తులు లెక్క చేయకుండా అంగరంగ వైభవంగా కొనసాగించి నిమజ్జనం చేశారు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా స్థానిక ఎస్సై సిబ్బందితోపాటు బందోబస్తు ఏర్పాటు చేశారు

డీజే హోరులో చిన్నారుల అదిరిపోయే స్టెప్పులు..

పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నవరాత్రి నిమజ్జన వేడుకలు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద గల ట్రాలీ అసోసియేషన్ నాయకులు బుధవారం అత్యంత భక్తి శ్రద్ధలతో నవరాత్రులు పూర్తి చేసుకున్నారు. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. ఈ వేడుకల్లో డీజే సౌండ్స్ హోరు మధ్య భక్తులు, చిన్నారులు చేసిన ఆటపాటలు చూపరులను ఎంతగానో ఆకట్టుకు న్నాయి. ముఖ్యంగా శోభాయాత్రలో భాగంగా ఓ బాలుడు చేసిన ఉత్సా హభరితమైన నృత్యాలు (స్టెప్పులు) అక్కడివారందరినీ మంత్రముగ్ధులను చేశాయి. భక్తి భావానికి తోడు చిన్నారుల ఉత్సాహం ఉరకలేయడంతో నిమజ్జన వేడుకలు పండుగ వాతావరణంలో కన్నుల పండువగా సాగాయి.



వార్డు మెంబర్ల సమస్యల
పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా



పెద్దపల్లి, ప్రభాతవార్త: వార్డు మెంబర్ల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి సొప్పరి సంతోష్ కుమార్ తెలిపారు. బుధవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం రాష్ట్ర ఫౌండర్ నాగవెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు, పెద్దపల్లి జిల్లా తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం ఆధ్వర్యంలో మంథని నియోజకవర్గ ఇన్‌చార్జిగా సొప్పరి సంతోష్ కుమార్‌ను నియమించారు. పెద్దపల్లి జిల్లా ఫోరం ఇన్‌చార్జి తప్పట్ల మోహన్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో సొప్పరి సంతోష్ కుమార్‌కు మంథని నియోజకవర్గ బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి తప్పట్ల మోహన్ మాట్లాడుతూ, మంథని నియోజకవర్గ పరిధిలోని వార్డు మెంబర్లను సమన్వయం చేసుకుంటూ ఏకతాటిపైకి తీసుకురావాలని సూచించారు. నూతనంగా నియమితులైన మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి సొప్పరి సంతోష్ కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ఫౌండర్ నాగవెల్లి జ్యోతి మహేష్, జిల్లా ఇన్‌చార్జి తప్పట్ల మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని వార్డు మెంబర్లను సమన్వయం చేసుకుంటూ, వారి సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా మీడియా ఇన్‌చార్జి సిహెచ్. ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

పెద్దపల్లి వార్త



చలో యాదగిరిగుట్టకు భారీగా తరలిరావాలి
జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య.

ఓదెల,ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 27న యాదగిరిగుట్టలో నిర్వహించనున్న "చలో యాదగిరిగుట్ట" కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా నుంచి ఉద్యమకారులు భారీగా తరలిరావాలని ఫోరం రాష్ట్ర కన్వీనర్, జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ఓదెల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి వారికి తగిన గౌరవం, గుర్తింపు, సంక్షేమం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యమకారుల సమస్యలను సంబంధిత కమిటీ సమగ్రంగా పరిశీలించి న్యాయబద్ధమైన పరిష్కారం చూపాలని కోరారు.ఈ సమావే శంలో ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, కందుల సదాశివ్ ,చర్లపల్లి సురేష్‌గౌడ్, పలకల నరసింహారెడ్డి, కందుల అశోక్‌పటేల్, మేకల శ్రీనివాస్, మాచర్ల రవీందర్ గౌడ్, గోవిందుల ఎల్లస్వామి, మద్దూరి బాలు, మల్లేశం, రవీందర్, కుక్కల రాజు, తొట్ల రాములు, చర్లపల్లి రాజయ్య పాల్గొన్నారు.



ఓదెల మల్లన్నను దర్శించుకున్న కాపు కార్పొరేషన్ చైర్మన్ శ్రీరామ్ చక్రవర్తి

ఓదెల,ప్రభాతవార్త: పెద్దపల్లి జిల్లాలో అతి పెద్దదైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరొందిన ఓదెల శ్రీ మల్లికార్జున స్వామివారిని మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వీరభద్రయ్య ఆయనకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందించారు. ముందుగా ఆలయానికి వచ్చిన మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ శ్రీరామ్ చక్రవర్తి ని ఓదెల మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, ఆలయ కమిటీ మాజీ డైరెక్టర్ ఉప్పుల శ్రావణ్ కుమార్ సాల్వాతో సన్మానించి స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

వినాయకుడి కలశం 10,016 లకు అందుకున్న కావటి రాజు దంపతులు

ఓదెల,ప్రభాతవార్త: ఓదెల మండలంలోని బాయమ్మపల్లె గ్రామంలో శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు 9 రోజులు నవగ్రహాల పూజలు అందుకున్న స్వామివారి కలశం వేలం వేశారు. ఈ వేలంపాటలో రూ.10,016లకు కావటి భాగ్యలక్ష్మి రాజు యాదవ్ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజు, ఉపసర్పంచ్ గాలి రాజు యాదవ్‌తో పాటు మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



బై.. బై.. గణేషా.. మళ్లీ రావయ్యా..!

ఘనంగా గణనాథుల నిమజ్జనం
భక్తిశ్రద్ధలతో సాగిన గణేశుడి శోభాయాత్ర
వీధివీధినా పండుగ వాతావరణం..
సందడిగా నిమజ్జన కార్యక్రమం

చొప్పదండి, ప్రభాతవార్త: చొప్పదండి పట్టణంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ముగిశాయి. బుధవారం పట్టణంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన గణనాథుల మండపాల నుంచి విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై ఊరేగింపుగా తరలించి నిమజ్జనం చేశారు. గణనాథుడి శోభాయాత్రలతో పట్టణ వీధులు సందడిగా మారాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జై బోలో గణేశ్ మహారాజ్ అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు.నవరాత్రుల సందర్భంగా మండపాల వద్ద ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించిన భక్తులు.. నిమజ్జన వేళ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. చిన్నారులు, మహిళలు, యువత, వృద్ధులు అనే తేడా లేకుండా ఉత్సాహంగా పాల్గొన్నారు. డప్పు వాయిద్యాలు, భక్తిగీతాలు, నృత్యాలతో శోభాయాత్రలు వైభవంగా సాగాయి. గణనాథుడి విగ్రహాలను పూలతో అందంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లారు.

12వ వార్డులో ప్రత్యేక సందడి

పట్టణంలోని 12వ వార్డులో కౌన్సిలర్ ముద్దం రాజేశ్వరి తిరుపతి ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వార్డులోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. మహిళలు, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో వార్డులో పండుగ వాతావరణం నెలకొంది. గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ భక్తులు సందడి చేశారు.గణనాథుడి విగ్రహాన్ని ఊరేగింపుగా నిమజ్జన ప్రాంతానికి తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజులపాటు పూజలు అందుకున్న గణనాథుడికి చివరి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళహారతులు ఇచ్చి ఘనంగా వీడ్కోలు పలికారు. నిమజ్జనం సందర్భంగా భక్తులు గణనాథుడిని స్మరించుకుంటూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

భక్తిశ్రద్ధల మధ్య వీడ్కోలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాల వద్ద ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు.. నిమజ్జనోత్సవాన్ని కూడా అదే ఉత్సాహంతో నిర్వహించారు. గణనాథుడి శోభాయాత్రలు పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయా ప్రాంతాల్లో ప్రజలు శోభాయాత్రను తిలకిస్తూ గణనాథుడికి నమస్కరించారు.నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా



నిర్వాహకులు, భక్తులు సమన్వయంతో వ్యవహరించారు. పండుగ వాతావరణంలో ఆనందోత్సాహాలతో నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, చొప్పదండి పట్టణం మరింత అభివృద్ధి చెందాలని భక్తులు ఆకాంక్షించారు.

హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణనాథులకు ఘన స్వాగతం

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా చొప్పదండి పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని గణనాథుల ఊరేగింపు ర్యాలీకి ఘన స్వాగతం పలికే కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని ఉత్సవ సమితి కేంద్రం వద్ద గణనాథుల కు స్వాగతం పలుకుతూ హిందూ ఉత్సవ సమితి సెంటర్ వద్ద కొబ్బరికాయలు కొట్టించి నిమజ్జనానికి పంపే కార్యక్రమం ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బస్వాపూర్ లో సైనిక్ దళ్ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం..

గణనాథుడి సన్నిధిలో భక్తులు పూజలు.

తంగళ్లపల్లి,ప్రభాత వార్త. తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామంలో వినాయక మండపం వద్ద సైనిక్ దళ్ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం భక్తి పారవశ్యంలో నిర్వహించారు.విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించిన అనంతరం మండప నిర్వాహకులు,భక్తులు సంయుక్తంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విఘ్నాలు తొలగించే వినాయకుడి ఆశీస్సులతో అన్నదానం మహాదానమనే సందేశాన్ని చాటుతూ యువకులు చేసిన ఈ కార్యక్రమానికి భక్తుల నుండి విశేష స్పందన లభించింది. గ్రామస్తులు,మహిళలు, యువకులు,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో సైనిక్ దళ్ యూత్ సభ్యులు,భక్తులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..



మండల స్థాయి పోటీల్లో సత్తా చాటిన శ్రీనిక..

అభినందించిన మండపల్లి సర్పంచ్ సాగర్..

తంగళ్ళపల్లి,ప్రభాత వార్త.. మండల స్థాయిలో నిర్వహించిన యువ టూరిజం క్లబ్ పోటీల్లో టీజీఎంఎస్ మండేపల్లి పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు.నిర్వహించిన నాలుగు విభాగాల పోటీల్లోనూ ప్రథమ స్థానం కైవసం చేసుకుని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాటల పోటీలో 6వ తరగతి విద్యార్థిని శ్రీనిక,రిపోర్ట్ ప్రజెంటేషన్ లో 9వ తరగతి విద్యార్థిని తను శ్రీ, మినీ మ్యూజియం, హెరిటేజ్ వాక్ విభాగాల్లో 9వ తరగతి బి బాలికల బృందం ప్రథమ బహుమతులు సాధించారు.విజేతలను మండపల్లి సర్పంచ్ సాగర్, ప్రిన్సిపాల్,ఉపాధ్యాయ బృందం అభినందించారు.



న్యాయ రంగంలో సేవలకు గుర్తింపు

గోదావరిఖని, ప్రభాతవార్త:

గోదావరిఖని సీనియర్ న్యాయ వాది చందాల శైలజకు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్‌కుమార్ సింగ్ అభినంద నలు తెలిపారు. ఇటీవల తెలంగా ణ బార్ కౌన్సిల్ సభ్యురాలిగా ఎన్నికైన సందర్భంగా బుధవారం ఆమెను సన్మానించారు.తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టు ఆవరణలో నూతనంగా ఎన్నికైన బార్ కౌన్సిల్ సభ్యుల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి అపరేష్‌కుమార్ సింగ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో చందాల శైలజకు ప్రత్యేకంగా అభినందనలు అందించారు. తెలంగాణ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్. రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు చెలకాని వెంకట్‌యాదవ్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు గన్నమనేని కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. గోదావరిఖని నుంచి బార్ కౌన్సిల్ సభ్యురాలిగా చందాల శైలజ ఎన్నిక కావడం పట్ల స్థానిక న్యాయవర్గాలు హర్షం వ్యక్తం చేశాయి .

చొప్పదండి వార్త



నరేందర్ రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి,ప్రభాతవార్త: చొప్పదండి మండలంలోని చాకుంట గ్రామంలో మంగళవారం పిడుగుపాటుకు గురై మృతి చెందిన మాజీ ఎంపీటీసీ గోపు మంగ భర్త గోపు నరేందర్ రెడ్డి మృతి చెందగా బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నరేందర్ రెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు. పిడుగుపాటు కు గురై నరేందర్ రెడ్డి మరణించడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పురం రాజేశం, పెద్ది రాజేందర్ తో పాటు పలువురు పాల్గొన్నారు.



నరేందర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సుంకె

చొప్పదండిప్రభాతవార్త: చొప్పదండి మండలం చాకుంట గ్రామంలో మాజీ ఎంపీటీసీ గోపు నరేందర్ రెడ్డి మంగళవారం మధ్యాహ్నం పిడుగుపాటుకు మృతి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను స్థానిక బిఆర్ఎస్ నేతలతో కలిసి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని కోరారు. పిడుగుపాటు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల భద్రతకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వెల్మ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రామకృష్ణ సేవా సమితి ఆర్థిక సహాయం

చొప్పదండి,ప్రభాతవార్త: చొప్పదండి పట్టణంలోని 9వ వడ్లూరి నరేష్ అనారోగ్యంతో మృతిచెందగా, నరేష్ కు భార్య ముగ్గురు పిల్లలు ఉండడం నిరుపేద రావడంతో బుధవారం రామకృష్ణ సేవా సమితి ని సంప్రదించగా శ్రీ వెంకటేశ్వర విద్యాసంస్థల డైరెక్టర్ సింహాచలం హరికృష్ణ 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించగా, సేవా సమితి వ్యవహారాల ఇంచార్జ్ ఉడత శంకరయ్య చేతుల మీదుగా నరేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెట్ల రాము, వి హెచ్ పి అధ్యక్షులు పడకంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మిడ్ మానేర్ జలాశయానికి స్వల్ప వరద

మానేరుపై నిలకడగా నీటిమట్టం

బోయిన్ పల్లి ప్రభాత వార్త

ఎగువ నుంచి మిడ్ మానేరు జలాశయానికి స్వల్పంగా వరద కొనసాగుతోంది. మంగళవారం ఉదయం 6 గంటల నాటికి జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లు కాగా, ప్రస్తుత నీటిమట్టం 316.32 మీటర్లకు చేరింది.జలాశయంలో ప్రస్తుతం 23.392 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, పూర్తి సామర్థం 27.55 టీఎంసీలు. ఇన్‌ఫ్లో 1111 క్యూసెక్కులుగా ఉంది. ఇందులో గోదావరి పంప్ హౌస్ నుంచి 1000 క్యూసెక్కులు,



మానేరు, ములవాగు, వరద కాలువల నుంచి 111 క్యూసెక్కులు వస్తోంది. అవుట్ ఫ్లో 170 క్యూసెక్కులుగా ఉంది.ప్రస్తుతం స్పిల్ వే గేట్లు ఎత్తలేదని, పరిస్థితిని పర్యవేక్షి స్తున్నట్లు అధికారులు తెలిపారు.

బండపల్లి గ్రామంలో పోషణ మాసం కార్యక్రమం

పాల్గొన్న సర్పంచి మల్లేశం

చందుర్తి : ప్రభాతవార్త

చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో రెండవ అంగన్వాడి కేంద్రంలోపోషణ మాసం కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి ద్వారా అందిస్తున్న సేవలపై అంగన్వాడి ఉపాధ్యాయురాలు బుర్ర రేణుక అవగాహన కల్పించారు. అంగన్వాడి కేంద్రాలను చిన్నారులు. గర్భిణీలు. బాలింతలు



సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా చిన్నారి బాబు తెంబరవేణి విశ్వేశ్వర్ కు సర్పంచి కటకం మల్లేశం అక్షరాభ్యాసం చేయించారు. అలాగే అన్నప్రాసన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అనంతరం పోషణ మాసం ప్రాముఖ్యత పై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్కకం మల్లేశం, ఉప సర్పంచ్ పల్లపు ఇసాక్. వార్డు సభ్యులు లింగంపల్లి బాబు. గడ్డం నాగరాణి. ఆరోగ్య సిబ్బంది వజ్ర. వసంత పిల్లల తల్లులు పాల్గొన్నారు,

సన్న రకాల వరిపై రైతులకు అవగాహన

హనుమాజిపేట్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం

వేములవాడ రూరల్ ప్రభాతవార్త

వేములవాడ రూరల్ మండలంలోని హనుమాజిపేట్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ పథకంలో భాగంగా రైతు వేదికలో బొల్లారం క్లస్టర్ రైతులకు పలు వ్యవసాయ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వరి సన్న రకాలలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, పంట మార్పిడి విధానం, పామాయిల్ సాగు, వరి ధాన్యం కొనుగోలు సమయంలో పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా పంట దిగుబడి, నాణ్యతను పెంచుకోవచ్చని సూచించారు.వరి సాగులో సరైన విత్తన ఎంపిక, ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ, నీటి యాజమాన్యం వంటి అంశాలను శాస్త్రీయ పద్ధతుల్లో పాటించాలని వ్యవసాయ అధికారులు సూచించారు.



పంట మార్పిడి ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు లభిస్తాయని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రోండి రాజు, పీఏసీఎస్ వేములవాడ చైర్మన్ వకులాభరణం శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి వినీత, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ సాయికుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి మసూద్, వేములవాడ గ్రామీణ ఏటీఎంఏ సభ్యుడు సురేష్ పాల్గొన్నారు.అలాగే ఏఎంసీ డైరెక్టర్ శ్రవంతి, పీఏసీఎస్ డైరెక్టర్లు మల్లయ్య, రామ్‌రెడ్డి తదితరులతో పాటు బొల్లారం క్లస్టర్‌కు చెందిన రైతులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న గ్రానైట్ క్వారీలు

నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న మైనింగ్ అధికారులు

బోయిన్ పల్లి ప్రభాత వార్త

బోయిన్ పల్లి మండలం లోని నర్సింగాపూర్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ క్వారీ లను నడిపిస్తున్నారని పలువురు ఆరోపించారు. మైనింగ్ అధికారులు పట్టించుకోకుండా ఉండడంవల్ల ఈ విధంగా యజమానులు వ్యవహరిస్తున్నారని తక్షణమే మైనింగ్ అధికారులు సర్వే నిర్వహించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గుర్తింపు రద్దు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



ప్రమాదకరంగా మారుతున్న మూల మలుపు

ఆర్ అండ్ బి అధికారుల దృష్టి సారించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి



బోయిన్ పల్లి ప్రభాత వార్త

బోయిన్ పల్లి మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో మూల మలుపులు ప్రమాదకంగా మారి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందికరంగా మారాయని పలువురు ఆరోపించారు. మండలంలోని పలు గ్రామాలలో ప్రమాదకరంగా మారిన మూల మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేసినట్లయితే ప్రమాదాల నివారణను అరికట్టవచ్చని పలువురు తెలిపారు. తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు మొద్దు నిద్ర వీడి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని పలువురు కోరారు.

బూరుగు పల్లి గ్రామంలో పోషణ మాసం కార్యక్రమంపాల్గొన్న పెంచాల సౌమ్య



బోయిన్ పల్లి ప్రభాతవార్త

బోయిన్ పల్లి మండలం లోని బూరుగు పల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి ద్వారా అందిస్తున్న సేవలపై అంగన్వాడి ఉపాధ్యాయురాలు అతికం లత అవగాహన కల్పించారు. అంగన్వాడి కేంద్రాలను చిన్నారులు. గర్భిణీలు. బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.అనంతరం పోషణ మాసం ప్రాముఖ్యత పై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు . పెరుక గౌతమీ ,ఆరోగ్య సిబ్బంది ,గ్రామ కార్యదర్శి శ్రీకాంత్ , పిల్లల తల్లులు పాల్గొన్నారు.

వేములవాడ వార్త

ఫ్యాక్స్ డైరెక్టర్‌గా తిరుపతి

సన్మానించిన గ్రామస్తులు



కొనరావుపేటరూరల్, ప్రభాతవార్త:

కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన వీరబోయిన తిరుపతి యాదవ్ కొలనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొలనూరు గ్రామానికి చెందిన నాయకులు,రైతులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో తిరుపతి యాదవ్ మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని, రైతులకు మరింత సేవ చేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షి ంచారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు, పలువురు పాల్గొన్నారు.

బోయిన్ పల్లి లో ఘనంగా వినాయక నిమజ్జనం వేడుకలు



బోయిన్ పల్లి ప్రభాత వార్త

బోయిన్ పల్లి మండలం లో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో ప్రజలందరూ తొమ్మిది రోజులు వినాయకునికి ఘనంగా పూజలు చేసి ఆటపాటలతో వినాయక నిమజ్జనం వేడుకలో పాల్గొని వినాయకున్ని చెరువులలో నిమజ్జనం చేశారు.కొన్ని గ్రామాలలో లడ్డు వేలం పాట ద్వారా లక్కీ డీప్ ద్వారా గెలుపొందిన వ్యక్తులకు లడ్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో యువత ,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

రాజన్న నిత్యాన్నదాన సత్రానికి లక్ష వెయ్యి నూట పదహారు విరాళం



వేములవాడ ప్రభాతవార్త:

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలోని అన్నప్రసాద సత్రం నిర్వహణకు దాతలు విరాళం అందజేశారు.వేములవాడ పట్టణానికి చెందిన నగుబోతు వీణ-రఘురామ్ దంపతులు ..1,01,116 నగదు విరాళాన్ని ఆలయ ఈవో రమాదేవికి అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దాతలకు స్వామివారి శేష వస్త్రం,లడ్డూ ప్రసాదం అందజేశారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం అందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు ఎడ్ల శివసాయి, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చలో యాదగిరిగుట్ట పోస్టర్ ఆవిష్కరణ

రామగిరి ప్రభాతవార్త

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 27న నిర్వహించనున్న చలో యాదగిరిగుట్ట కార్యక్రమం పోస్టర్‌ను బుధవారం సెంటినరీ కాలనీలోని రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం వద్ద ఆవిష్కరించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల ఉద్యమకారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పోతు జ్యోతి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి భక్తుల



శంకర్, పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు సిలివేరి సుధాకర్, దాసరి రామస్వామి, ఎన్. మల్లేశ్వరి, కీర్తి లక్ష్మీ నారాయణ, సైండ్లా బాపు, ఆరెందల ప్రకాష్, ఆవునూరి నర్సయ్య, సముద్రాల తిరుపతి, కొండ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణలతో స్వయం ఉపాధి ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధి

మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, సర్పంచ్ పెగడ తిరుమల కుమార్, ఉప సర్పంచ్ సింగనవేన సదకే

కేశనపల్లి గ్రామంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ.. మహిళలకు ఘనంగా సర్టిఫికెట్లు అందజత

ముత్తారం, ప్రభాతవార్త:

నైపుణ్య శిక్షణలతో స్వయం ఉపాధి ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధి సాధించాలని మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, సర్పంచ్ పెగడ తిరుమల కుమార్, ఉప సర్పంచ్ సింగనవేన సదయ్య అన్నారు. ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామంలో మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, స్వయం ఉపాధి పొందేలా అందించిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణను పూర్తి చేసుకున్న మహిళలకు బుధవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. శిక్షణలో పొందిన మహిళలు స్వయం ఉపాధి !!యనిట్లను ఏర్పాటు చేసుకొని, ఆర్థికంగా పురోగతి సాధించాలని వారు ఆకాంక్షి ంచారు.



ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బక్కతట్ల వినీత్ యాదవ్, గ్రామ వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, కాంగ్రెస్ కార్యకర్తలు, శిక్షణ పొందిన మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గోకుల్ నగర్‌లో రికార్డు స్థాయిలో గణపతి లడ్డు వేలం

రూ.50,500లకు లడ్డును దక్కించుకున్న శ్రీకృష్ణ యూత్ సభ్యులు

రూ.20 వేలకు కలశాన్ని దక్కించుకున్న బట్టి రాజయ్య

రామగిరి ప్రభాతవార్త

రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామ పరిధిలోని గోకుల్ నగర్‌లో మట్టి గణపతి మండపం వద్ద నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో లడ్డు వేలం బుధవారం ఉత్సాహంగా జరిగింది. ఈ వేలంలో లడ్డు రికార్డు స్థాయిలో రూ.50,500లకు శ్రీకృష్ణ యూత్ సభ్యులు దక్కించుకున్నారు.అదేవిధంగా గణపతి మండపంలోని కలశాన్ని రూ.20 వేలతో బట్టి రాజయ్య దక్కించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు,



యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వేలంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గణపతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వేలం కార్యక్రమం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లడ్డు, కలశం వేలంలో వచ్చిన మొత్తాన్ని ఉత్సవాల నిర్వహణకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు

కుమ్మరిపల్లె గణేశ్ మండపానికి డీజే బాక్స్‌ల కోసం విరాళాలు

ముత్తారం, ప్రభాతవార్త:

ముత్తారం మండల కేంద్రంలోని కుమ్మరిపల్లె యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన గణేష్ మండపం కోసం పలువురు విరాళాలు అందించారు. మాజీ జడ్పిటిసి నాగినేని జగన్‌మోహన్‌రావు రూ.10వేలు, ముత్తారం మాజీ సర్పంచ్ తాటిపాముల వకుళారాణి శంకర్ దంపతులు రూ.10వేల చొప్పున మొత్తం రూ.20 వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా !!యత్ సభ్యులు మాట్లాడుతూ అందరి సహకారంతో గణేశ్ ఉత్సవాలను ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని తెలిపారు.



మంథని వార్త



శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో

వాయిస్ పంపిన వ్యక్తి రిమాండ్ కు తరలింపు

రుద్రంగి ప్రభాత వార్త :



శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో వాయిస్ పంపిన రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మోతె నితిన్ (24)అనే యువకుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని చందుర్తి సిఐ కె. రవీంధర్ తెలిపారు. సిఐ కె.రవీందర్, ఎస్ఐ మోతిరాం తెలిపిన వివరాప్రకారం రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మోతె నితిన్ పోలీస్ ఉన్నతాధికారులను ఉద్దేశించి ఓపెన్ ఛాలెంజ్ చేస్తూ రుద్రంగిలో బుధవారం జరిగే వినాయనిమజ్జనంలో లా ఆండ్ ఆర్డర్ ప్రాబ్లం సృష్టిస్తానని, పోలీస్ కానీ ఆర్మీ కానీ వచ్చినా కంట్రోల్ కాకుండా చేస్తానని తనతో గొడవ పెట్టుకున్నవారిని చంపుతాననిలేదా తాను అయినా చాస్తానని రుద్రంగి మండల గ్రూపులలో వాయిస్ రికార్డు పెట్టి బెదిరింపులకు పాల్పడ్డాడని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసిన రుద్రంగిఎస్ఐ మోతీరాం విచారణ చేపట్టి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు మోతె నితిన్ అంబేద్కర్ విగ్రహం వద్ద అనుమానస్పదంగా కనిపించగా వెంటనే అతన్నిపట్టుకొని అతడి వద్ద నుండి నేరానికి ఉపయోగించిన వాయిస్ రికార్డు ఉన్న సెల్ఫోను స్వాధీనం చేసుకొని అనంతరం నిందితుడిని రిమాండుకు తరలించడంజరిగిందన్నారు. ఈ సందర్భంగా సిఐ కె. రవీంధర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం, ఇతర పండుగల సమయంలో ప్రజలందరూ భక్తితో పాటు సామాజిబాధ్యతతో మెలగాలని. సోషల్ మీడియా లేదా వాట్సాప్ గ్రూపుల ద్వారా ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు. పబ్లిసిటీ కోసం సోషల్‌మీడియాను ఉపయోగించుకొని సమాజ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించినా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే మెసేజ్లు ప్రచారం చేసినావారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాంతియుత వాతావరణంలో నిమజ్జనోత్సవాలు జరుపుకోవాలి

ఎస్సై రామ్మోహన్

ప్రభాతవార్త కోనరావుపేట

గణేష్ నిమజ్జనాల్లో డీజేలకు అనుమతి నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలుసమయపాలన పాటిస్తూ ప్రశాంతంగా విగ్రహాల నిమజ్జనం చేసుకోవాలిగణేష్ నిమజ్జన ఉత్సవాలను ప్రశాంత, ఆధ్యాత్మిక వాతావరణంలో సురక్షి తంగా జరుపుకోవాలని కొనరావుపేట మండల ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులకు ఎస్సై రామ్మోహన్ విజ్ఞప్తి చేశారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక నిబంధనలు విధిస్తున్నట్లు వెల్లడించారు. నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు, అధిక శబ్దాలు ఇచ్చే సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. శబ్ద కాలుష్యం వల్ల వృద్ధులు, రోగులు, చిన్నపిల్లలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని, ప్రజలు, వాహనదారులకు భంగం కలిగించవద్దని సూచించారు. భక్తులంతా వేళాపాళ పాటించి విగ్రహాల నిమజ్జనాన్ని సకాలంలో, త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. పోలీస్ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను, సమయపాలనను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేసినా, మద్యం సేవించి ఊరేగింపుల్లో అల్లర్లు, న్యూసెన్స్ చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొమ్మిది రోజుల



పాటు నవరాత్రులను భక్తిశ్రద్ధలు, శాంతియుత వాతావరణంలో నిర్వహించినట్లే.. నిమజ్జనోత్సవాన్ని కూడా అంతే సురక్షి తంగా, ప్రశాంతంగా పూర్తి చేసుకొని పోలీస్ యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

బై బై గణేశా వినాయకా... వీడ్కోలిక.



..చందుర్తి, ప్రభాతవార్త

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు భక్తులతో విశిష్ట పూజలు అందుకున్న బోజ్జ గణపయ్యలను బుధవారం నిమజ్జనం కు తరలించారు. గణపతి బొప్పా మోరియా అంటూ యువకులు కేరింతల మధ్య గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్లారు. చందుర్తి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో వివిధ కూడళ్లలో గల వినాయక మండపాల వద్ద ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పూజ సామాగ్రి, లడ్డు వస్త్రాలు, తదితర వాటికి వేలంపాట నిర్వహించారు. భక్తులు కోటపోటీగా వేలం పాడి దక్కించుకున్నారు. భారీ ర్యాలీగా తీసుకువెళ్లి స్థానిక చెరువుల్లో వినాయకులను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చందుర్తి సిఐ రవీందర్. ఎస్సై జిల్లేల రమేష్ ఆధ్వర్యంలో భారీ

జలసిరి పనులతో భూగర్భ జలాల పెంపునకు చర్యలు

వెంగళాయిపేటలో స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్

పెగడపల్లి, ప్రభాతవార్త:

గ్రామ పంచాయతీ ప్రణాళిక, జలసిరి కార్యక్రమంలో భాగంగా స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీ శ్రీధర్ బుధవారం పెగడపల్లి మండలంలోని వెంగళాయిపేట గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామసభ నిర్వహించి ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, జలసిరి పనుల ప్రాముఖ్యతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. రైతులు తమ పొలాల్లో వ్యవసాయ కుంటలు ఏర్పాటు చేసుకోవాలని, గ్రామంలో ఊటకుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టే పారిశుధ్య పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు.అలాగే వి.బి.జి. రామ్‌జీ కార్యక్రమంలో భాగంగా వికసిత్ గ్రామసభ ప్లాన్‌ను రూపొందించి, రాబోయే ఆర్థిక సంవత్సరానికి అవసరమైన కొత్త అభివృద్ధి పనులను గుర్తించాలని సూచించారు.కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గౌతం రెడ్డి, డీఆర్‌డీవో రఘువరన్, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఏపీవో అనిల్ కుమార్, సర్పంచ్ గోపాల్, ఉప సర్పంచ్ కుంచె రాజేందర్, ఏపీఎం రవివర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంతోష్, ఈసీ రమాపతి, టీఏలు నాని, రాజేశం, డీటీసీ మనోజ్, తిరుపతిరావు, ఎస్‌బీఎం కో ఆర్డినేటర్ హరిణి, పంచాయతీ కార్యదర్శి మధు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



చెరువు కట్టపై విద్యుత్ స్తంభాల ఏర్పాటు

గొల్లపల్లి, ప్రభాతవార్త:

గొల్లపల్లి మండలంలోని అగ్గిమల్ల గ్రామంలో పోచమ్మ ఆలయం నుంచి బతుకమ్మ కుంట మీదుగా మైసమ్మ ఆలయం వరకు చెరువు కట్టపై నూతనంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు.ఈ పనులను గ్రామ సర్పంచ్ కంకణాల వసంతలక్ష్మ ణ్ చేతుల మీదుగా ప్రారంభించారు. చెరువు కట్టపై విద్యుత్ స్తంభాల ఏర్పాటు వల్ల రాత్రివేళల్లో వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లే రైతులకు, ప్రజలకు వెలుతురు సౌకర్యం కలగడంతో పాటు, ఆలయాలకు వెళ్లే భక్తులకు కూడా సౌకర్యంగా ఉంటుందన్నారు. నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు ప్రారంభం కావడంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, మండల ఎంపీఓ ప్రదీప్, జేఎల్‌ఎం అరుణ్తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఘనంగా గణనాథుని నిమజ్జన వేడుకలు

డీజే పాటలతో యువత సందడి.. మహిళల కోలాటాలతో అంగరంగ వైభవంగా వీడ్కోలు

రూ.17,516లకు లడ్డూ

వేలంగొల్లపల్లి, ప్రభాతవార్త:

వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథులకు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. గొల్లపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సమీపంలోని చెరువులు, కుంటల్లో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.నిమజ్జన వేడుకల్లో యువతీ యువకులు డీజే పాటలకు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేయగా, మహిళలు కోలాటాలతో వేడుకలకు మరింత శోభ తీసుకొచ్చారు. 'గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా' అంటూ భక్తులు నినాదాలు చేస్తూ గణనాథులకు ఘనంగా వీడ్కోలు పలికారు. పలు ప్రాంతాల్లో నిమజ్జన శోభాయాత్రలు ఉత్సాహభరితంగా కొనసాగాయి.రూ.17,516లకు లడ్డూ వేలంవినాయక మండపాల్లో తొమ్మిది రోజులపాటు పూజలు అందుకున్న లడ్డూ ప్రసాదానికి ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. మండల కేంద్రంలోని నల్లగుట్ట శ్రీ రాజరాజేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించగా రామగిరి సత్తయ్య రూ.17,516లకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. మరికొన్ని మండపాల్లో లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.గణపతి వద్ద తొమ్మిది రోజులపాటు పూజలు అందుకున్న లడ్డూ ప్రసాదాన్ని వ్యవసాయ క్షేత్రాల్లో, వ్యాపార కేంద్రాల్లో ఉంచితే అన్ని రంగాల్లో అభివృద్ధి, శుభం కలుగుతుందని భక్తుల విశ్వాసం.పోలీసుల పటిష్ట బందోబస్తునిమజ్జన వేడుకల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు, పోలీసుల పర్యవేక్షణలో నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా కొనసాగాయి.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



గొల్లపల్లి, ప్రభాతవార్త:

గొల్లపల్లి మండలంలోని బొంకూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముల్కల శిరీష శ్రీనివాస్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియ మరింత సులభతరం కానుందని ఈ సందర్భంగా తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో జీపీఓ, రేషన్ డీలర్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

పెగడపల్లి, ప్రభాతవార్త:



పేద ప్రజలకు రేషన్ కార్డులు వరం లాంటివని మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ అన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం పెగడపల్లి మండలం ల్యాగలమర్రి గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్ ఎల్కటూరి రవితో కలిసి ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రాములు గౌడ్ మాట్లాడుతూ పేదలకు నిరంతరం రేషన్ కార్డులు మంజూరు చేస్తూ వారి సంక్షేమం, అభివృద్ధికి తెలంగాణ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కడారి తిరుపతి, మండల నాయకులు చెట్ల కిషన్, చాట్ల విజయభాస్కర్, మారం కొమురయ్య, కర్ణకంటి మల్లారెడ్డి, పాపిరెడ్డి, కల్లేపల్లి రాజు, ఉప సర్పంచ్ పుప్పాల అంజయ్య, జీపీవో సాదుల్ల, పంచాయతీ కార్యదర్శి శంకర్, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు

ధర్మపురి వార్త

మట్టి వినాయకులతో ప్రత్యేక గుర్తింపు..



ఎడ్లబండిపై సంప్రదాయ శోభాయాత్రతో
మరో ఆదర్శం మట్టి గణపతికి జై.. గ్రామీణ సంస్కృతికి సై

గొల్లపల్లి, ప్రభాతవార్త:

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లక్ష్మీ ాపూర్ గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ఘనంగా నిర్వహించారు. లక్ష్మీ ాపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయం వద్ద వినాయక మండపాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలను నిర్వహించగా, కార్యక్రమాల నిర్వహణను గ్రామ సర్పంచ్ కాసం రాజశేఖర్ పర్యవేక్షి ంచారు. ఈ ఏడాది గ్రామంలో మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించేలా ప్రోత్సహించడం ద్వారా లక్ష్మీ ాపూర్ ప్రత్యేక గుర్తింపు పొందింది. నిమజ్జన శోభాయాత్రలోనూ ఆధునిక హంగులకు దూరంగా పూర్వీకుల కాలం నాటి సంప్రదాయాన్ని పాటించి మరోసారి ఆదర్శంగా నిలిచింది. హనుమాన్ దేవాలయంలో ప్రతిష్ఠించిన వినాయక స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై ఉంచి, తమ్మడ-సన్నాయి, మంగళ వాయిద్యాల నడుమ గ్రామ వీధుల గుండా భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎడ్లబండిపై వినాయకుడి శోభాయాత్ర గ్రామీణ వాతావరణాన్ని తలపిస్తూ అందరినీ ఆకట్టుకుంది. పూర్వీకుల ఆచారాలు, గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి పరిచయం చేసేలా ఈ కార్యక్రమం సాగింది. మట్టి విగ్రహాల వినియోగంతో పర్యావరణ పరిరక్షణకు సందేశం ఇవ్వడంతో పాటు, సంప్రదాయ పద్ధతుల్లో నిమజ్జన శోభాయాత్ర నిర్వహించడం ద్వారా గ్రామీణ సంస్కృతిని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో కార్యక్రమాలను నిర్వహించినట్లు సర్పంచ్ కాసం రాజశేఖర్ తెలిపారు. ఇతర గ్రామాలు, వినాయక మండపాల నిర్వాహకులు కూడా పర్యావరణహిత, సంప్రదాయ పద్ధతులను అనుసరించేందుకు లక్ష్మీ ాపూర్ కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలవాలని వారు ఆకాంక్షి ంచారు

రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో కోలాహలంగా బొజ్జ గణపయ్య నిమర్జనం



జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ మోరపెల్లి గ్రామంలో రెడ్డీస్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో వినాయక నిమర్జన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.స్వామివారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగిస్తూ గ్రామంలో శోభాయాత్రను ఎంతో ఉత్సాహంగా,భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.శోభాయాత్ర పొడవునా యువకులు,భక్తులు డప్పు వాయిద్యాల మోతలు,నృత్యాలతో సందడి చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతి సమర్పించి,స్థానిక జలాశయంలో వేడుకగా నిమర్జనం గావించారు. ఈ కార్యక్రమంలో రెడ్డీస్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు,యువకులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని

అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిమజ్జనం నిర్వహించాలి

గోదావరిఖని గోదావరి బ్రిడ్జి వద్ద నిమజ్జన పాయింట్ పరిశీలన.. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త: గణపతి నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. బుధవారం గోదావరిఖని గోదావరి బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన పాయింట్‌ను సీపీ అంబర్ కిషోర్ ఝా, కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లు, శోభాయాత్ర మార్గం, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖ, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, మున్సిపల్, సింగరేణి తదితర ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా డీజేలు వినియోగించడాన్ని పూర్తిగా నిషేధించినట్లు సీపీ స్పష్టం చేశారు. నిమజ్జనోత్సవం సందర్భంగా పోలీసుల సూచనలు, నిబంధనలను గణేష్ ఉత్సవ కమిటీ



నిర్వాహకులు, భక్తులు తప్పనిసరిగా పాటించాలని కోరారు. గణపతి శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను మత సామరస్యానికి ప్రతీకగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, సింగరేణి, మున్సిపల్ శాఖల అధికారులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బై.. బై.. గణేషా.. మళ్లీ రావయ్యా..!

పెద్దపల్లిలో నేత్రపర్వంగా గణేష్ నిమజ్జన వేడుకలు

నియమనిష్టలతో పూజించిన వినాయకులను ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం

ప్రజలందరూ ఆ విగ్నేశ్వరుని ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలి: విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు

పెద్దపల్లి, ప్రభాతవార్త: నవరాత్రుల పాటు భక్తిశ్రద్ధలతో కొలిచిన గణనాథుల నిమజ్జన వేడుకలు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కన్నుల పండువగా జరిగాయి. ఒక వైపు డీజే హోరు, మరోవైపు భక్తుల జైకారాలతో పెద్దపల్లి జిల్లా కేంద్రం మార్మోగింది. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న వినాయక స్వామిని సాగనంపే క్షణం కన్నుల పండువగా జరిగింది. పట్టణంలోని ఎల్లమ్మ గుండమ్మ (మినీ ట్యాంక్ బండ్) కట్ట వద్ద బుధవారం నాడు గణపతి నిమర్జన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిం చారు. పట్టణంలోని ఎల్లమ్మ గుండమ్మ చెరువు కట్ట వద్ద ఈ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు, మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్‌లతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఎంతో నిష్టతో పూజలందుకున్న గణనాథుడిని భారీ క్రేన్ ద్వారా ఆయన భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణ రావుని వేదపండితులు వేదమంత్రాలతో ఘనంగా ఆశీర్వదించి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ..పెద్దపల్లి నియోజకవర్గ వ్యాప్తం గా ప్రజలు గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులు జరుపుకొని నేడు నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా జరుపుకున్నారని అన్నారు. నిమర్జన వేడుకల్లో ప్రజలు సమయపాలన పాటించి నియమ నిష్టలతో ప్రశాంత వాతావరణంలో ఈ వేడుకలు నిర్వహించుకున్నారని తెలిపారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా విద్యుత్ శాఖ సర్వం సిద్ధం చేసిందని పేర్కొన్నారు. సింగరేణి కోల్ మైన్స్ నుండి భారీ క్రేన్లను తెప్పించి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా నిమర్జనానికి పూర్తి ఏర్పాట్లు చేశామని, ఈ సౌకర్యాలను ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. అలాగే ఈ నిమర్జన ప్రక్రియ విజయవంతంగా సాగేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎల్ చైర్మన్ ముస్త్యాల నరేష్, తహశీల్దార్ రాజయ్య, ఎలక్ట్రికల్ ఎస్ ఈ గంగాధర్, ఏసీపీ గజ్జి కృష్ణ, సిఐ ప్రవీన; టౌన్ ప్లానింగ్ అధికారి నరేష్, ఏఈ రాజ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది, నాయకులు మందల సత్యనారాయణ రెడ్డి తదితరులున్నారు.

డిజిటల్ తెలంగాణ లక్ష్య సాధనలో మీసేవ సేవలు ఎంతో కీలకమైనవి

మీసేవ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నగునూరి శ్రీనివాస్

పెద్దపల్లి, ప్రభాతవార్త: డిజిటల్ తెలంగాణ లక్ష్య సాధనలో మీసేవ సేవలు ఎంతో కీలకమని మీసేవ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నగునూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో తెలం గాణ మీసేవ వ్యవస్థ 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 15వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. డిజిటల్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో విశేష ప్రతిభ కనబరిచిన మీసేవ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నగునూరి శ్రీనివాస్‌కు అరుదైన గౌరవం దక్కింది. మెటా యాడ్స్ క్యాంపెయిన్ సేవలను అత్యుత్తమంగా అందించినందుకు ఆయనకు బెస్ట్ మీసేవ వీఎలఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా మెటా, మీసేవ సంయుక్తంగా అందజేసిన పురస్కారాన్ని నగునూరి శ్రీనివాస్ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా అందుకు న్నారు. స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించడం, డిజిటల్ సేవలను బలోపే తం చేయడం, డిజిటల్ తెలంగాణ లక్ష్య సాధనలో శ్రీనివాస్ చేస్తున్న కృషిని నిర్వాహకులు అభినందించారు. డిజిటల్ వీ ఎల్ ఈలు బలమైన పౌరులు ఉజ్వల తెలంగాణ అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం లో.. స్థానిక వ్యాపారాల వృద్ధికి, ప్రజల్లో డిజిటల్ సేవలపై అవగాహన కల్పించేందుకు శ్రీనివాస్ కృషిని గుర్తించి ఈ అవార్డును అందజేశారు.



జాతీయ స్థాయి థాంగ్‌టా పోటీలకు ఐపీఎస్ విద్యార్థులు.....

అభినందించిన పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ

సుల్తానాబాద్, ప్రభాతవార్త: జాతీ య స్థాయి థాంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ పోటీలకు సుల్తానాబాద్ పట్ట ణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశా లకు చెందిన నలుగురు విద్యా ర్థులు ఎంపికయ్యారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో నిర్వహిం చనున్న జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నారు.ఇటీవల హైదరా బాద్‌లో రాష్ట్ర థాంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఐపీఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఏ. అద్వైత్ 56 కేజీల విభాగంలో, ఎం. సంప్రీత్ 46 కేజీల విభాగంలో, కె. మైత్రి వరుణ్ 52 కేజీల విభాగంలో, టి. ధనుష్‌కుమార్ 56 కేజీల విభాగంలో ఎంపికయ్యారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు పాఠశాలలో విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. శ్రీనగర్‌లో జరిగే జాతీయ పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయికి ఎంఎ ికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలి పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ సునీత, మేనేజర్ శివ, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారా యణ, సతీష్, జ్యోతి పాల్గొన్నారు.





నిఘా నీడలో గణేష్ నిమజ్జనం

కరీంనగర్‌లో భారీ పోలీస్ బందోబస్తు

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త :

ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా గణేష్ నిమజ్జనోత్సవం ప్రశాంత వాతావరణంలో, వైభవంగా కొనసాగుతోంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 2,400 విగ్రహాలు, నగర మున్సిపల్ పరిధిలో సుమారు 1,000 విగ్రహాల నిమజ్జనం కోసం యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది.

గట్టి భద్రత నడుమ శోభాయాత్ర:

850 మందితో బందోబస్తు: నిమజ్జన విధులకు గానూ దాదాపు 850 మంది పోలీస్ సిబ్బందిని రంగంలోకి దించారు. గాంధీ చౌక్, టవర్ సర్కిల్, కమాన్ సర్కిల్ వంటి ప్రధాన మార్గాల్లో సాగే శోభాయాత్రపై పోలీసులు సీసీ కెమెరాలు, నిఘా బృందాలతో ప్రత్యేక కన్ను ఉంచారు.
రంగంలోకి క్రైమ్ షీ టీమ్స్: రద్దీ ప్రాంతాల్లో జేబుదొంగతనాలు, నేరాల ను అరికట్టేందుకు క్రైమ్ బృందాలను, మహిళల భద్రత కోసం ప్రత్యేక షీ టీమ్స్‌ను నియమించారు. సున్నితమైన ప్రాంతాల్లో పికెట్లు, పెట్రోలింగ్, స్ట్రైకింగ్ ఫోర్స్‌లతో నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు.
చెరువులు, కెనాల్స్ వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు: మానకొండూర్, కొత్తపల్లి చెరువు, చింతకుంట కెనాల్‌లను ప్రధాన నిమజ్జన ప్రాంతాలుగా గుర్తించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల్లో రాత్రి వేళల్లో వెలుగుల కోసం విద్యుత్ లైటింగ్, విగ్రహాల నిమజ్జనానికి భారీ క్రేన్లు, అత్యవసర పరిస్థితుల ఎదుర్కొనేందుకు నిపుణులైన ఈతగాళ్లు (స్విమ్మర్స్), డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బోట్లను సిద్ధంగా ఉంచారు.
ట్రాఫిక్ మళ్లింపులు జాయింట్ కంట్రోల్ రూమ్: నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మానకొండూర్ హైవే, కొత్తపల్లి మార్గాల్లో భారీ వాహనాల రాకపోకలను నిలిపివేసి దారి మళ్లించారు. వెలిచాల క్రాస్ రోడ్ వద్ద ట్రాఫిక్ డైవర్షన్ అమల్లోకి తెచ్చారు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, ఆర్టీసీ, పోలీస్, వైద్య శాఖల సమన్వయంతో మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా జాయింట్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.
అలాగే నిమజ్జన సమయంలో అభ్యంతరకరమైన పాటలు, అధిక శబ్దంతో కూడిన డీజేలను ఉపయోగించవద్దని అధికారులు స్పష్టం చేశారు. భక్తులందరూ పోలీసులకు సహకరిస్తూ నిమజ్జనోత్సవాన్ని సురక్షితంగా జరుపుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం కోరారు.





గౌడ హక్కులు సమస్యల కోసం రాజీలేని పోరాటాలకు సిద్ధం

గౌడ సామాజిక వర్గం సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి

గౌడ రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్

బోయిన్ పల్లి ప్రభాత వార్త

తెలంగాణ రాష్ట్రంలో గౌడ సామాజిక వర్గం సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని గౌడ రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ తెలిపారు. గౌడ విద్యార్థులు యువకులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గౌడ సామాజిక వర్గం అనేక సమస్యలను ఎదుర్కొంటుంది అని తక్షణమే సమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. గౌడ యువతను ఆదుకునే విధంగా గౌడ యువతకు ప్రత్యేక కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలని, విదేశీ విద్యను అభ్యసిస్తున్న గౌరవిద్యార్థులకు అధిక మొత్తంలో స్కాలర్షిప్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. గౌడ్ అన్నలు ఎవరైనా తాడిచెట్టు పైనుండి పడి ఆకస్మిక



మరణం చెందితే వారికి పరిహారం పెంచాలని కోరారు. రాష్ట్రంలో జనాభా ప్రాతిపాదికన గౌడ్ అన్నలకు అన్ని రాజకీయ పార్టీ లలో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా తాటి చెట్లను, ఈత చెట్లను నరికి వేస్తే వారిపై కఠిన చట్టాలు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ రక్షణ సమితి నాయకులు రాజు,సురేష్ ,గణేష్ ,వేణు, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సిడిపిఓ సౌంద

చందుర్తి : ప్రభాతవార్త

అంగన్వాడి కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని సౌందర్య అన్నారు. చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి శ్రీధర్. ఎంపీడీవో రాధ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషణ మాసం సందర్భంగా పుట్టిన ప్రతి పిల్లవాడికి పౌష్టికాహారం అందిస్తూ వారి యొక్క మానసిక ఆరోగ్య ఎదుగుదలకు పునాదులు వేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ కేంద్రంలో లభించే



సేవలను తల్లులు వినియోగించుకోవాలన్నారు. బాలామృతంతో చేసిన పిండి వంటలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలుక మల్లీశ్వరి అంజి బాబు వైద్య సిబ్బంది పుష్పలత, విశ్వేశ్వర్ ఐసిడిఎస్ సూపర్వైజర్ శంకరమ్మ.ఐకెపి ఎపిఎం కళ్యాణి అంగన్వాడీ ఉపాధ్యాయులు రాధిక. పద్మ వివో వినోద తల్లులు. గర్భవతులు.బాలింతలు పాల్గొన్నారు,

భీమేశ్వర ఆలయంలో డిజిటల్ కియోస్క్‌లు ప్రారంభం

.క్యూలైన్ల తిప్పలకు చెక్.

.డిజిటల్ చెల్లింపులతో ప్రసాదాలు, పూజా టికెట్లు.

.వేములవాడ ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నూతన డిజిటల్ కియోస్క్‌లు, ప్రసాద కౌంటర్లు అందుబాటులోకి వచ్చాయి. బుధవారం ఆలయ ఈవో రమాదేవి ప్రత్యేక పూజలు నిర్వహించి అధికారికంగా ప్రారంభించారు.భీమేశ్వర సదన్ వసతి గృహం సమీపంలో, అలాగే ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ డిజిటల్ కియోస్క్‌ల ద్వారా భక్తులకు వేగవంతమైన సేవలు అందనున్నాయి. ఇకపై ప్రసాదాలు, పూజా టికెట్ల కోసం ఎక్కువసేపు క్యూలైన్లలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా యూపీఐ, ఇతర డిజిటల్ చెల్లింపు విధానాల ద్వారా టికెట్లు పొందే అవకాశం కల్పించారు.కియోస్క్‌ల ద్వారా లడ్డూ, పులిహోర ప్రసాదాల టికెట్లతో పాటు ఇతర పూజా టికెట్లు సులభంగా పొందవచ్చని ఆలయ అధికారులు



తెలిపారు. భక్తుల సమయం ఆదా చేయడంతో పాటు ఆలయంలో సేవలను మరింత పారదర్శకంగా, సౌకర్యవంతంగా అందించడమే లక్ష్యంగా ఈ సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డీఈవో నవీన్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ప్రధాన అర్చకులు, వేద పండితులు, దేవస్థాన ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా వినాయక నిమజ్జనం

.మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించిన మున్సిపాలిటీ..

వేడుకల్లో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్.

.వేములవాడ ప్రభాతవార్త:

పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో బుధవారం నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథులను భక్తులు నిమజ్జనానికి తరలించారు.వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో తొలిసారిగా మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగింపుగా తరలించారు.ఎమ్మెల్యే స్వయంగా జీపు నడపడంతో పాటు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లతో కలిసి ఉత్సాహంగా నృత్యం చేశారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి వినాయకుడిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిమజ్జన వేడుకలను భక్తులు



ప్రశాంతంగా, క్రమశిక్షణతో నిర్వహించాలని కోరారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతుల ఇంట పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు.నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గుడి చెరువు వద్ద జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కమిషనర్ లోకేష్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బ్యాగుల పంపిణీ.



.వేములవాడ ప్రభాతవార్త:

వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా బ్యాగులు అందజేశారు.విద్యార్థుల ప్రత్యేక శ్రద్ధతో చదువుకుని, వారి విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు

రీసర్వేకు వెంకటాంపల్లి ఎంపిక



పైలట్ ప్రాజెక్టుగా గ్రామం.. గ్రామసభలో అవగాహన

వేములవాడనరూరల్ప్రభాతవార్త:

వేములవాడ రూరల్ మండలం వెంకటాంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ ఆవునూరి లక్ష్మి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టనున్న భూముల రీసర్వేకు సంబంధించిన అంశాలపై అధికారులు గ్రామస్థులకు అవగాహన కల్పించారు.వెంకటాంపల్లి గ్రామాన్ని భూముల రీసర్వేకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. గ్రామంలోని ప్రతి సర్వే నంబర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూముల వాస్తవ పరిస్థితులు, విస్తీర్ణం, హద్దులు, హక్కులకు సంబంధించిన వివరాలను సర్వే చేయనున్నట్లు వివరించారు. త్వరలోనే రీ సర్వే ప్రక్రియను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.గ్రామంలోని భూములకు సంబంధించి భూభారతి రికార్డుల ప్రకారం మొత్తం 122 సర్వే నంబర్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. వీటి మొత్తం విస్తీర్ణం 393.21 ఎకరాలు/గుంటలు కాగా, అందులో పట్టా భూమి విస్తీర్ణం 376.08గా నమోదైందని పేర్కొన్నారు. అదేవిధంగా 6 ప్రభుత్వ భూముల సర్వే నంబర్లలో 17.13 విస్తీర్ణం ఉన్నట్లు వివరించారు.రీసర్వే ద్వారా భూముల హద్దులు, రికార్డుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. సర్వే సమయంలో రైతులు, భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలతో అధికారులకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్వే ఏడీ శ్రీనివాస్, ఎమ్మార్వో ఎం.డి. అబూబకర్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ బాలు, జీపీఓ రాజశేఖర్, గ్రామపంచాయతీ కార్యదర్శి బూర నవీన్, ఉపసర్పంచ్ వెలిచాల మల్లేశం, వార్డు సభ్యులు మారా అనిల్, పసునూరి స్వరూప, మాజీ సర్పంచ్, మాజీ ఉపసర్పంచ్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు



భక్తిశ్రద్ధలతో గణేశుడి నిమజ్జనం

ప్రభాత వార్త కోనరావుపేట

:కోనరావుపేట మండల కేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, భజనలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించిన భక్తులు బుధవారం గణనాథుడిని నిమజ్జనం చేశారు.మండపాల వద్ద ప్రత్యేక పూజలు

వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కౌన్సిలర్లు

రాయికల్ ప్రభాతవార్త:



రాయికల్ పట్టణంలోని మైతాపూర్ రోడ్డు వద్ద వినాయక నిమజ్జన వేడుకల కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను బుధవారం మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జనానికి తరలివచ్చే గణేష్ విగ్రహాల నిర్వాహకులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.నిమజ్జన ప్రదేశంలో చేపడుతున్న పనులు, పారిశుద్ధ్య ఏర్పాట్లు,విద్యుత్ దీపాలు,రహదారి సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. నిమజ్జన వేడుకలు విజయవంతంగా జరిగేలా మున్సిపల్ పాలకవర్గం అన్ని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కల్లెడ ధర్మపురి,పుర్రె శ్రీధర్,పల్లికొండ గంగాధర్,కూనారపు మానస, కోఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, మహేష్, నాయకులు మచ్చ శేఖర్,బత్తిని నాగరాజు, సుధవేని మురళి,తోపారపు సురేష్,వేముల రాము,ఏఈ దీపక్, సానిటరీ ఇన్స్పెక్టర్ ఫయాజ్,వినయ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోరండ్ల గణపతి లడ్డూను కైవసం చేసుకున్న బేతి మహిపాల్ రెడ్డి దంపతులు

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ పోరండ్ల గ్రామంలోని రెడ్డి కమ్యూనిటీ అండ్ సిద్ధి వినాయక మహారాజ్ వారి లడ్డూ వేలం పాట కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది.గణనాథుని నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ లడ్డూ వేలం పాటలో గ్రామానికి చెందిన బేతి మహిపాల్ రెడ్డి చందన దంపతులు 6,666 రూపాయలకు దక్కించుకున్నారు.స్వామివారి లడ్డూను కైవసం చేసుకోవడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ, వినాయకుని ఆశీస్సులు ఊరి ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు.ఈ వేలం పాట కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోడుగం బాపు రెడ్డి, నాగిరెడ్డి గంగారెడ్డి,పొగల్ల శ్రీనివాస్ రెడ్డి,పడిగేలా గంగారెడ్డి,వంగ మధుకర్ రెడ్డి,బేతి రాజిరెడ్డి, లక్కడి రంజిత్ రెడ్డి,గూడ రాజిరెడ్డి,పొగల్ల మధు రెడ్డితో పాటు సంఘ నాయకులు,మహిళా సోదరీమణులు,గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రెడ్డి సంఘంలో గణేష్ లడ్డూ వేలం

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల జిల్లా కేంద్రంలోని రెడ్డి జన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుని ఏర్పాటు చేశారు. గణేష్ నవరాత్రులు పూజలు అందుకున్న విగ్నేశ్వరుడు బుధవారం ఉత్తర పూజ అనంతరం ఉత్తర పూజ అనంతరం లడ్డూ వేలం వేయగా 56 వేలకు ముసుకు గంగారెడ్డి భారతమ్మలు దక్కించుకున్నారు. అనంతరం విఘ్నేశ్వరుని శోభయాత్ర కార్యక్రమం నిర్వహించారు. రెడ్డి సంఘం అధ్యక్షులు వెంకట్ రెడ్డి తో పాటు కార్యవర్గ సభ్యులు రెడ్డి సంఘం నాయకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని గణేష్ శోభాయాత్ర ను విజయవంతం చేశారు

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్..

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27న జగిత్యాల జిల్లాలోని రాయికల్ గ్రామం, మండలంలోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం) లో వేడుకలను ఘనంగా నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్యాటక రంగం ప్రాధాన్యత, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి కల్పన, సాంస్కృతిక మార్పిడి, సుస్థిర అభివృద్ధిలో పర్యాటక రంగం పోషించే కీలక పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.2026 సంవత్సరానికి "డిజిటల్ అజెండా మరియు కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగం పునర్రూపకల్పన" అనే థీమ్‌ను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా వివిధ కార్య క్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ నిర్వహణపై ఈ నెల 9న రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో తాను పాల్గొన్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను రాయికల్‌లోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో నిర్వహించా లని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల విశిష్టతను ప్రజలకు తెలియజేస్తూ పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

గణేష్ నిమజ్జనోత్సవం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహణ

: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,

సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ..

- చింతకుంట చెరువు ఇమ్మర్షన్ పాయింట్,

టవర్ సర్కిల్ వద్ద భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా

పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:జిల్లాలో గణేష్ నిమజ్జన మహోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, తెలిపారు. గణేష్ నిమజ్జనోత్సవంలో భాగంగా జగిత్యాల పట్టణంలోని టవర్, తీన్ కాని, మంచినీళ్ల బావి, చింతకుంట చెరువు ఇమ్మర్షన్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో గణేష్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జనోత్సవాల మొదటి రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, శోభాయాత్రలు సజావుగా సాగేలా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని అన్నారు. రద్దీ ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరమైన చోట వెంటనే చర్యలు తీసుకునేలా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు.నిమజ్జనానికి వచ్చే భక్తులు పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ గారు కోరారు.గణేష్ నిమజ్జనోత్సవాలు పూర్తయ్యే వరకు పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటారని, ప్రజల సహకారంతో జిల్లాలో గణేష్ నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఎస్పీ వెంట డీఎస్పీ లు పురుషోత్తం రెడ్డి, రవికుమార్, ఇన్స్పెక్టర్లు ఆరిఫ్ అలీఖాన్ కరుణాకర్, రామ్ నర్సింహారెడ్డి, పోలీస్ అధికారులు ఉన్నారు.

రక్త నమూనా మాయం..

పేషెంట్‌కు మళ్లీ పరీక్ష..!..

మాతా శిశు కేంద్రం సిబ్బందిపై నిర్లక్ష్య ఆరోపణలు ..

జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేసిన ఆర్టీఐ జిల్లా

అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్



కొడిమ్యాల, ప్రభాతవార్త: పేదలు, గర్భిణీలకు మెరుగైన వైద్య సేవలు అందాల్సిన జగిత్యాల జిల్లా మాతా శిశు కేంద్రంలో సిబ్బంది నిర్లక్ష్యంపై ఆరోపణలు వెలువడ్డాయి. రక్త పరీక్ష కోసం సేకరించిన నమూనా కనిపించకుండా పోవడంతో సంబంధిత పేషెంట్‌కు మళ్లీ రక్తం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆర్టీఐ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. కొడిమ్యాల మండలానికి చెందిన ఓ పేషెంట్ ఈ నెల 18న మాతా శిశు కేంద్రంలో ఓపీ ద్వారా సంబంధిత వైద్యుడిని సంప్రదించారని రవీందర్ తెలిపారు. వైద్యుడు రక్త పరీక్షలు సూచించడంతో పేషెంట్ నుంచి రక్త నమూనా సేకరించి, సంబంధిత రిజిస్టర్‌లో 1279343 నంబరుతో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సాయంత్రం ఫోన్‌కు సందేశం వస్తుందని, మరుసటి రోజు పరీక్షా ఫలితాలు తీసుకోవాలని సిబ్బంది చెప్పినట్లు తెలిపారు. అయితే రిపోర్టు కోసం పలుమార్లు ఆరా తీసినా సరైన సమాధానం లభించలేదని, చివరకు రికార్డుల ఆధారంగా విచారించగా సేకరించిన రక్త నమూనా కనిపించలేదని రవీందర్ పేర్కొన్నారు. దీంతో మళ్లీ రక్త నమూనా ఇవ్వాల్సి వచ్చిందని తెలిపారు. రక్త నమూనాల సేకరణ, భద్రపరిచే విషయంలో సిబ్బంది అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుందని రవీందర్ అన్నారు. నమూనాలు తారుమారైనా, తప్పిపోయినా రోగుల ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ల్యాబ్ సిబ్బంది పనితీరుపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. పేషెంట్లకు ఏదైనా సమస్య తలెత్తినప్పుడు ఫిర్యాదు చేసేందుకు గతంలో ఆసుపత్రి ఆవరణలో సూపరింటెండెంట్ పేరు, ఫోన్ నంబరు తదితర వివరాలు ప్రదర్శించేవారని, ప్రస్తుతం అవి కనిపించడం లేదని రవీందర్ తెలిపారు. అలాగే ఆర్టీఐ చట్టానికి సంబంధించిన సమాచార బోర్డు కూడా ఆవరణలో లేదని పేర్కొన్నారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం వహించినట్లు తేలితే సంబంధిత ల్యాబ్ టెక్నీషియన్లు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారిని కోరినట్లు ఆయన తెలిపారు. పేషెంట్లకు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు, వైద్యుల పేర్లు, ఫోన్ నంబర్లను ఆసుపత్రి ఆవరణలో స్పష్టంగా ఏర్పాటు చేయాలని ఫిర్యాదులో కోరినట్లు చెప్పారు.